Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 23.03.2018, శుక్రవారం సంపుటి : 37 సంచిక : 42 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com



- ఆపరేషన్ ఆంధ్ర మొదలైంది
- బాబు లోపాలను, పాపాలను తవ్వనున్నారు
- కర్నాటక ఎన్నికల తర్వాత ఏపికి ప్రత్యేకహోదా?

## బీజేపీ ఎత్తుగడలతో...

# బాబుకు దడ

నాలుగేళ్ళ చంద్రబాబు పాలనలోని పాపాలను బీజేపీ బయట పెట్టబోతోందా? బాబు విధానాలలోని వైఫల్యాలను ఎత్తి చూపనుందా? కేంద్రం ఇచ్చిన నిధులకు లెక్కలేవంటూ బొక్కలు వెదకనుందా? ఇది మీ అవినీతి చిట్టా అంటూ చీటీ చించబోతుందా? ఓటు-నోటు కేసును తిరగతోడనుందా? పోలవరం అంచనా వ్యయం పెంపులో బాబు అక్రమాలను ప్రశ్నించబోతుందా? వైరిపక్షాలతో జతకట్టి తెలుగుదేశం పార్టీని కకావికలం చేయనుందా? రాష్ట్ర రాజకీయాలలో ప్రస్తుతం వినిపిస్తున్న ప్రశ్నలివి.

నిజమే ప్రస్తుత రాజకీయ పరిణామాలను చూస్తుంటే త్వరలో వీటిలో కొన్ని ప్రశ్నలకైనా సమాధానాలు లభించే అవకాశాలు లేకపోలేదు.

బీజేపీ అధిష్టానం ఆపరేషన్ ఆంధ్రను మొదలుపెట్టింది. ఈ క్రమంలోనే జమ్మూ-కాశ్మీర్‌తో పాటు ఈశాన్య రాష్ట్రాలలో సైతం బీజేపీ జెండాను రెపరెపలాడించిన రాంమాధవ్‌ను ఏపి ఇన్‌ఛార్జ్‌గా నియమించింది. రాంమాధవ్ వెనువెంటనే రంగం లోకి దిగడం కూడా జరిగింది. ఏపిలో తెలుగుదేశం అవినీతిపై, చంద్రబాబు పాలనా వైఫల్యాలపై ఎదురుదాడి చేయండంటూ బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా నుండి రాష్ట్ర బీజేపీ నాయకులకు సందేశాలు అందాయి. రాష్ట్రంలో తెలుగుదేశంను దెబ్బకొట్టడమే లక్ష్యంగా బీజేపీ వ్యూహరచన వుండబోతోంది. అయితే రాష్ట్రంలో సొంతంగా అంత సీన్ బీజేపీకి లేదు. రాజకీయంగా ఆ పార్టీ చాలా తక్కువుగా వుంది. దీనికితోడు అధికారంలోకి వచ్చాక ప్రత్యేకహోదా ఇవ్వకపోవడంతో రాష్ట్ర ప్రజల్లో ఆ పార్టీపై వ్యతిరేకత పెరిగింది. జిఎస్టీ, నోట్ల రద్దు వంటి అంశాలు ఆ పార్టీపై వ్యతిరేకతను పెంచాయి. ఈ పరిస్థితుల్లో ఒంటరిగా ఆ పార్టీ తెలుగుదేశంను ఏమీ చేయలేదు. ఇందుకోసం ఆ పార్టీ ఎంచుకున్న మార్గం జనసేన. ఇటీవల గుంటూరులో నిర్వహించిన జనసేన పార్టీ ఆవిర్భావ సభలో చంద్రబాబు, లోకేష్‌లపై పవన్ కళ్యాణ్ చేసిన అవినీతి ఆరోపణలతో తెలుగు దేశం నాయకుల కళ్ళు బైర్లు కమ్మాయి. ఎందుకంటే ఆ ముందు క్షణం వరకు కూడా పవన్‌కళ్యాణ్ మా వాడు అనే వాళ్ళను కుంటున్నారు. పవన్ ఇచ్చిన ఊహించని షాక్‌తో వాళ్ళకు ఏ విధంగా ముందుకు పోవాలో తెలియలేదు. పవన్‌కళ్యాణ్ ఇక మనోడు కాదని, అతను బీజేపీ ట్రాప్‌లో పడ్డాడని వీళ్ళకై వీళ్ళు నిర్ధారించుకున్నాక అనుకూల మీడియా ద్వారా పవన్‌పై ఎదురుదాడి మొదలుపెట్టించారు.

బీజేపీ చర్యలు ఏ విధంగా ఉండబోతాయన్నదానిపైనే చంద్రబాబులో ఆందోళన వుంది. బీజేపీ వైపు నుండి కేవలం రాజకీయ దాడి మాత్రమే వుండదు. (మిగతా 11వ పేజీలో)




# హోదా హీరో ఎవరు?

- ఉద్యమానికి ఊపిరులూదిన జగన్
- ఢిల్లీని తాకిన హోదా సెగలు
- పిల్లిమొగ్గలతో అభాసుపాలైన చంద్రబాబు

ఒక తెలుగు సినిమాలో హీరో చిరంజీవిని విలన్‌లు చావగొడతారు. చచ్చిపోయాడనుకుని గొయ్యి తీసి పూడ్చేస్తారు. అతని ప్రేయసిని చెరపట్టబోతారు. అప్పుడు ఆమె హీరోనుద్దేశించి... రాజా రాజా అని కేక వేస్తుంది... ఆ కేకలు మన హీరో చెవిని తాకుతాయి. హీరో కళ్ళు తెరుస్తాడు. మట్టిని చీల్చుకుంటూ పైకి వస్తాడు. విలన్‌లపై విరుచుకుపడి వారికి నలుగు పెడతాడు. శుభం కార్డు పడుతుంది.

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా అన్నది కూడా అలాగే తయారైంది. రెండేళ్ల క్రితమే కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకహోదాను చావగొట్టి గోతిలో పడేసింది. "ప్రత్యేక హోదా వేస్ట్... ప్రత్యేక ప్యాకేజీయే బెస్ట్" అంటూ ఆరోజు (మిగతా 11వ పేజీలో)



ఢిల్లీలో వైసిపి సత్తా చూపుతున్న

## మరో మొనగాడు

లెక్కల మాంత్రికుడే కాదు... రాజకీయ తాంత్రికుడు కూడా అనిపించుకుంటున్న విజయసాయిరెడ్డి

(వివరాలు 11వ పేజీలో)



# రైతును ముంచేస్తున్నారు




- ఒకవైపు నీటి కొరత... మరోవైపు వానల వాత
- ధరల తగ్గుదలతో అన్నదాతలకు గుండెకోత

**జిల్లాలోని మెట్ట ప్రాంతాలు కరువు వాతపడ్డాయి. ఒకవైపు నీటి కొరత, మరోవైపు అకాల వర్షాలతో పంట పొలాలు దెబ్బతినడంతో రైతన్నలు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ముఖ్యంగా మెట్టలో చెరువులు దొరువుల్లో చుక్కనీరు లేక సేద్యం కుదేలైపోయింది. అప్పుల పాలై రైతన్నలు లబోదిబోమంటున్నారు. సాగునీటి వసతులు అంతంతమాత్రంగానే వుండడంతో ఎంతగా కష్టించి పనిచేసినా పంటలు సక్రమంగా పండక మెట్ట రైతులు పడే అవస్తలు అన్నిన్ని కావు. ముఖ్యంగా ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల్లోని అనేక మండలాలు కరువుతో విలవిల్లాడుతున్నా ప్రభుత్వం అన్నదాతల గోడును పట్టించుకోకపోవడం విచారకరం.**



ప్రతి ఏడాదీ జిల్లాలోని మెట్ట ప్రాంతాలు కరువుతో అల్లాడుతూనే ఉన్నాయి. లేదంటే అకాల వర్షాలు వచ్చి కొంప ముంచి పోతున్నాయి. గత కొద్ది సంవత్సరాలుగా వరుసగా వస్తున్న ఈ ప్రకృతి విపత్తులు మెట్ట ప్రాంతాల రైతులను అప్పుల సుడిగుండంలోకి నెడుతున్నాయి. అటు సాగునీరు లేక, ఇటు తాగునీరుకు కూడా కష్టాల పాలవుతున్నా రైతుల ఇబ్బందులను పట్టించుకునేవారు లేకపోవడం బాధాకరం. ఇక్కడ భూముల్లో అధికశాతం వర్షాధార భూములే. వరుణుడి కరుణ ఉంటే తప్ప ఇక్కడ చేలల్లో పంటలు పండవు. బోర్లు, బావుల కింద పంటలు సాగుచేసుకునే రైతుల పరిస్థితి కూడా దాదాపు అంతే. భూగర్భజలాలు అడుగంటిపోవడంతో పంటపొలాలకు చుక్క నీరు అందక రైతులు దిగాలుపడిపోయారు. సుమారు నాలుగువందల అడుగుల లోతుకు బోరు వేసినా నీటి చుక్క అందకపోవడంతో రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారు. మూగజీవాలకు తాగేందుకు కూడా నీరు దొరక్కపోవడంతో వాటి పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. ఎక్కడ చూసినా ఎండకు ఎండిన నేలలే తప్ప పచ్చదనం అన్నది కనిపించడం లేదు. కొండలు గుట్టలన్నీ వెదికినా మూగజీవాలకు గడ్డి దొరకడం లేదు. పాడిపశువులున్న రైతులు ఆ మూగజీవాలను ఎలా కాపాడుకోవాలో తెలియక కంటనీరు పెట్టుకుంటున్నారు. మరోవైపు ఈ కరువులో పంటలు పండక సేద్యానికి చేసిన అప్పులు తీర్చలేక ఎంతోమంది నిరుపేద రైతులు సతమతమవుతున్నారు. తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలో తెలియక అయోమయంలో ఉన్నారు. పొలాల్లో పనులు లేకపోవడంతో మెట్ట ప్రాంతాల్లో వేలాదిగా ఉన్న వ్యవసాయ కూలీలు ఇక్కడ పనులు లభించక, ఉన్న ఊరు వదిలిపెట్టి పొట్టచేత పట్టుకుని పనులున్న చోటికి వలసలు పోతున్నారు. మెట్ట చుట్టూ కరువు కమ్మేయడంతో ఈ ప్రాంతాల్లో వేసిన వరి తదితర పైర్లన్నీ అత్యధికశాతం నిలువునా ఎండిపోయాయి. ఒక్క ఉదయగిరి వ్యవసాయ సబ్ డివిజన్‌లోనే వరి సాగు సాధారణ విస్తీర్ణం 3,815 హెక్టార్లుంటే, ఇందులో వరిపంట సాగైంది కేవలం 358హెక్టార్లలో మాత్రమే. ఇదీ దుస్థితి. దీంతో వరి రైతుల కష్టాలకు అంతేలేదు. వరితో పాటు అనేక ప్రాంతాల్లో వేసుకున్న మొక్కజొన్న, జొన్న, రాగి, మినుము తదితర పంటలు కూడా వానలు లేక ఎండిపోయాయి. పండ్ల తోటలు కూడా ఈసారి కనీవినీ ఎరుగని నష్టాలకు గురయ్యాయి. నీరు లేక బత్తాయి, మామిడి, నిమ్మ తదితర తోటలన్నీ ఎండిపోవడంతో రైతన్న కన్నీటిపర్యంతం అవుతున్నాడు. ప్రభుత్వం జిల్లాలోని ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల్లోని 10 మండలాలలను కరువు మండలాలుగా ప్రకటించిందే తప్ప, కరువు కాటుకు గురైన ఆయా మండలాల్లోని రైతుల స్థితిగతులను అసలు పట్టించుకోవడం లేదు. ఆదుకునే వారు లేక రైతుల జీవన పరిస్థితులు దయనీయంగా మారాయి. ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం ఇకనైనా కరువు బారిన పడిన మెట్ట ప్రాంత రైతులను ఆదుకునేందుకు తక్షణచర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## కన్నీట ముంచిన...అకాలవర్షాలు

ఒకవైపు నీటిచుక్క లేక, అదనుకు వానలు కురవక పొలాలు ఎండిపోయి రైతులు బాధపడుతుతన్న తరుణంలో, మూలిగే నక్కమీద తాటికాయ పడ్డ చందంగా మరోవైపు కొన్ని ప్రాంతాల్లో కురిసిన అకాల వర్షాలు ఆయా ప్రాంతాల రైతులను కన్నీట ముంచాయి. కోతకు వచ్చిన పంట భారీవర్షానికి నీట మునిగిపోవడంతో రైతులు కన్నీట మునిగిపోయారు. ఈ నెల 16వ తేది అర్ధరాత్రి దాటాక నాయుడుపేట, వెంకటగిరి, ఓజిలి, మనుబోలు, పెళ్ళకూరు, దొరవారిసత్రం, ఓజిలి తదితర మండలాల్లో అకాల వర్షాలు కురిశాయి. రెండురోజుల పాటు కురిసిన ఈ వర్షాల వల్ల కోట్లాది రూపాయల నష్టం వాటిల్లినట్లు అంచనా. అనేకచోట్ల పంటలు దెబ్బతినడంతో పాటు, కల్లాల్లో ఆరబెట్టుకుని ఉన్న ధాన్యం కూడా నీటమునిగిపోవడంతో రైతులు గుండెలు బాదుకుంటున్నారు. సుమారు 2800 టన్నుల ధాన్యం నీటమునిగి ఉంటుందని భావిస్తున్నారు. వ్యవసాయ అధికారుల గణాంకాల ప్రకారం జిల్లాలో ఈ అకాల వర్షాల వల్ల రైతాంగానికి కనీసం 48 కోట్ల దాకా నష్టం ఉంటుందని అంచనా. పంటచేలతో పాటు పండ్లతోటలకు కూడా అపారనష్టం కలిగింది. మామిడిపూత నేలరాలిపోవడంతో మామిడి రైతులు గోడుగోడుమంటున్నారు. అన్ని రకాల పంటలు ఈ అకాలవర్షాలకు అపారంగా నష్టానికి గురయ్యాయి. ప్రభుత్వం వెంటనే అటు కరువు బాధిత రైతాంగానికి, ఇటు అకాలవర్షాలతో నష్టపోయిన రైతాంగానికి చేయూతను అందించాల్సి ఉంది. ఆ మేరకు జిల్లా అధికార యంత్రాంగం ఈ నష్టాల అంచనాలను ప్రభుత్వానికి నివేదించి సత్వరం అన్నదాతలను ఆదుకోవాల్సి ఉంది.

## పొట్టేపాలెం శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు

నెల్లూరురూరల్ మండలం పొట్టేపాలెంలోని శ్రీ కోదండరామస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలను ఈ నెల 26వ తేదీ నుండి ఏప్రిల్ 7వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఛైర్మెన్ పొన్నాల రామచంద్రారెడ్డి తెలిపారు. 26వ తేదీ అంకురార్పణతో తిరునాళ్ళు ప్రారంభమవుతాయి. 27వ తేదీ ధ్వజారోహణ, రాత్రి హంస వాహనం, 28వ తేదీ శేష వాహనం, 29వ తేదీ హనుమంతు సేవ, 30వ తేదీ సింహ వాహనం, 31వ తేదీ కల్పవృక్ష వాహనం, ఏప్రిల్ 1వ తేదీ గరుడసేవ, 2వ తేదీ కళ్యాణోత్సవం, 3వ తేదీ గజవాహన సేవ, 4వ తేదీ రథోత్సవం, 5వ తేదీ పట్టాభిషేకం, 6వ తేదీ అశ్వ వాహనం నిర్వహిస్తారు. 7వ తేదీ ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. ఉత్సవాలు జరిగే ప్రతిరోజూ ఉదయం దేవస్థానంలో హోమాలు నిర్వహిస్తున్నామని ఛైర్మెన్ రామచంద్రారెడ్డి తెలిపారు.

## యోగా మాస్టర్ ప్రసన్నకు ఉగాది పురస్కారం


ఉగాది పురస్కారాన్నందుకుంటున్న ప్రసన్నకుమార్

ఈ నెల 18న ఉగాది సందర్భంగా శ్రీకాళహస్తిలోని గురుమిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పురస్కారాల కార్యక్రమంలో నెల్లూరుకు చెందిన ప్రముఖ యోగా మాస్టర్ ప్రసన్నకుమార్‌కు విశిష్ట ప్రతిభా పురస్కారం అందజేశారు. రాష్ట్ర స్థాయిలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న మొత్తం 12 మంది ఈ పురస్కారాలకు ఎంపిక కాగా, నెల్లూరు నుంచి యోగా మాస్టర్ ప్రసన్న వారిలో ఒకరు కావడం విశేషం. శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం ట్రస్ట్‌బోర్డు మాజీ ఛైర్మెన్ కోలా ఆనంద్ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు. జిల్లా యోగ క్రీడా అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.నరసింహారెడ్డి, ఉపాధ్యక్షులు జెకె స్వప్న, ఎన్‌వి రమణారెడ్డి, చంద్రమాల్ తదితరులు ఈ సందర్భంగా ప్రసన్నకుమార్‌ను అభినందించారు.

## వింజమూరు చెన్నకేశవస్వామి తిరునాళ్ళు



వింజమూరులోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 27వ తేదీన అంకురార్పణతో ప్రారంభం కానున్నాయి. 28వ తేదీ ధ్వజారోహణ, శేష వాహనోత్సవం, 29వ తేదీ రాత్రి పొన్నమాను సేవ, 30వ తేదీ హనుమంతు సేవ, 31వ తేదీ గరుడ సేవ, ఏప్రిల్ 1వ తేదీ కళ్యాణోత్సవం నిర్వహించనున్నారు. 2వ తేదీ ఉదయం రథోత్సవం జరుగుతుంది. 3వ తేదీ పారువేట, 4వ తేదీ ఏకాంతసేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. వింజమూరు చెన్నకేశవస్వామి తిరునాళ్ళు అంటే చుట్టుపక్కల గ్రామాలలో ఎంతో ప్రసిద్ధి. జిల్లాలో పురాతనమైన చెన్నకేశవ దేవాలయం ఇదే! ఈ తిరునాళ్ళకు భక్తులు వేలాదిగా తరలివస్తుంటారు.

## రాజేశ్వరమ్మ గుడిలో శ్రీ గురుదక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ట



నెల్లూరు దుర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో ఈ నెల 30, 31తేదీలలో శ్రీ గురు దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం నిర్వహిస్తున్నారు. 30వ తేదీ ఉదయం 9గంటలకు గణపతిపూజ, పుణ్యాహ వాచనం, పంచగవ్యోపాసన, గోపూజ, దీక్షాధారణ, యాగశాల శుద్ధి వంటి పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం 6గంటలకు కలశ ప్రాణప్రతిష్ట, అంకురార్పణం, సకలదేవతా మండప ఆరాధన, అగ్ని ప్రతిష్ట, పుష్పాధివాసం, మహా నివేదన, మంగళహారతి వంటి పూజలు జరుగుతాయి. 31వ తేదీ ఉదయం 6గంటల నుండి పూజలు మొదలవుతాయి. 7.54-7.58 గంటల మధ్య యంత్ర ప్రతిష్ట, శిఖర ప్రతిష్ట, 8.30గంటల నుండి 9గంటలలోగా శ్రీ దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ట నిర్వహిస్తారు.

## శ్రీ చెంగాళమ్మ ఉత్సవాలు

ఐదేళ్ళకోసారి నిర్వహించే సూళ్ళూరుపేటలోని శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం బ్రహ్మోత్సవాలను ఈ ఏడాది మే 31వ తేదీ నుండి జూన్ 6వ తేదీ వరకు నిర్వహించనున్నారు. మే 31న సుడిమాను ప్రతిష్ట, జూన్ 1న అశ్వవాహనంపై గ్రామోత్సవం, 2న సుళ్ళు ఉత్సవం, మహిషాసురమర్ధిని, 3న సుళ్ళు ఉత్సవం, నంది వాహనం, 4న తెప్పోత్సవం, 5న శయన సేవ, 6న పుష్ప యాగం నిర్వహించనున్నారు.

## రోడ్డుపై ధాన్యం... సమస్యల్లో ప్రయాణం

ఇది వరికోతల సీజన్. ధాన్యాన్ని కళ్లాల్లో ఆరబోసుకోవాలి. కాని, ప్రధాన రహదారుల వెంబడి పొలాలు ఉండే రైతులు కోతలు కోసి కుప్ప పోసిన ధాన్యాన్ని రోడ్లపైనే ఆరబోస్తున్నారు. ఆరబోసిన ధాన్యం అంచుల్లో పెద్దపెద్ద బండరాళ్ళను పెడుతున్నారు. దీంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. నెల్లూరు, ఆత్మకూరుల మధ్య ముంబై జాతీయ రహదారిలో ఎక్కువుగా ధాన్యంతో రోడ్లను ఆక్రమించేస్తుండడంతో వాహనాల రాకపోకలు సమస్యగా మారుతోంది.

# ప్రతిభకు సత్కారాలు... ఉగాది పురస్కారాలు

నెల్లూరుకు చెందిన ఇద్దరు సంగీత సాహితీవేత్తలకు రాష్ట్ర ప్రభుత్వం అందజేసే ప్రతిష్ఠాత్మక ఉగాది పురస్కారాలు లభించాయి. వారిలో ఒకరు 'మాట' దీర్ఘ కవిత ద్వారా ఆ రెండక్షరాలకున్న శక్తిని ప్రపంచానికి పరిచయం చేసిన కవి చిన్ని నారాయణరావు అయితే రెండోవారు సాహితీవేత్త డాక్టర్ సాయినాథ్. ఈ నెల 18వ తేదీన విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన విళంబినామ సంవత్సర ఉగాది వేడుకలలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతులమీదుగా వీరిద్దరూ ఉగాది పురస్కారాలను అందుకున్నారు. విభజన అనంతరం అమరావతి రాజధానిగా ఏర్పడ్డ రాష్ట్రంలో రాష్ట్రస్థాయి ఉగాది పురస్కారాలు అందుకున్న నెల్లూరు జిల్లా తొలి సాహితీవేత్తలు వీరిద్దరు కావడం విశేషం.



## చిన్ని నారాయణరావు

వృత్తి పరంగా ఆయన ఆడిటర్ అయినా, ప్రవృత్తిని కవితా మార్గంగా ఎంచుకున్న చిన్ని నారాయణరావు అంటే నెల్లూరు జిల్లాలో తెలియనివారుండరు. కలాన్ని హలంగా పట్టి ఆయన అక్షరసేద్యం చేస్తున్నారు. కవితా వృక్షాలను పెంచుతున్నారు. రసరమ్యమైన కవితా ఫలాలను పండిస్తున్నారు. ఆయన అక్షరయజ్ఞం నుండి ఉద్భవించిన 'మాట' దీర్ఘ కవిత ఇటు తెలుగులోను, అటు ఇంగ్లీష్‌లోనూ ప్రచురితమై సామాన్యమానవుడి నుండి అసామాన్య ఉపరాష్ట్రపతి వరకు 'మాట'కు వున్న శక్తిని, మాటకున్న యుక్తిని ప్రపంచానికి చాటింది. అలాగే 'గంపకూడు' వంటి కవితా సంకలనాలు లెక్కలేనన్ని ఆయన అభ్యుదయ ఆలోచనల నుండి జాలువారాయి.



అన్నిటికి మించి గురుశిష్యుల బంధానికి గుర్తుగా నెల్లూరులో ప్రతిఏటా ఆయన నిర్వహిస్తున్న నాగభైరవ అవార్డ్ ప్రదానోత్సవం చిన్ని నారాయణరావు పేరును నెల్లూరుజిల్లా సాహితీ చరిత్రపై శాశ్వతంగా నిలబెట్టింది. కవిగా, రచయితగా గతంలో ఎన్నో సత్కారాలు, పురస్కారాలు అందుకున్న చిన్ని నారాయణరావులోని కవితా ప్రతిభను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పురస్కారాన్ని ప్రదానం చేయడం అందమైన అక్షరానికి అభినందన మాల వేయడమే!



## డాక్టర్ సాయినాథ్

సింహపురి సంగీత రంగంలో విశేష కృషి చేస్తూ ఎన్నో అవార్డులను, పురస్కారాలను అందుకున్న డాక్టర్ సాయినాథ్‌కు ఈ సారి మరెంతో ప్రతిష్ఠాత్మకమైన రాష్ట్రప్రభుత్వ ఉగాది పురస్కారం లభించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఆయన విళంబి నామ సంవత్సర ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. అటు వైద్యునిగా సమాజానికి సేవలందిస్తూ, రెడ్‌క్రాస్ స్వచ్ఛంధసేవా సంస్థకు కూడా తనవంతు సేవలందిస్తున్న డాక్టర సాయినాథ్ నెల్లూరీయులందరికీ సుపరిచితులే. వైద్యరంగంలో నిత్యం పనివత్తిడిలో ఉన్నప్పటికీ ఆయన మరోవైపు ఎంతో క్లిష్టమైన.. విశిష్టమైన సంగీత రంగంలోనూ సాధన చేసి తనకంటూ ప్రత్యేకత సాధించుకోవడం విశేషం. డాక్టర్ సాయినాథ్ ఆయా రంగాల్లో చేస్తున్న విశేషమైన సేవలకు గుర్తింపుగా,



ప్రత్యేకించి సంగీతరంగంలో ఆయన కృషికి గుర్తింపుగా రాష్ట్రప్రభుత్వం నుంచి ఈ అవార్డు లభించింది. ముఖ్యమంత్రి నుంచి పురస్కారాన్ని అందుకోవడమే కాక, ఘన సత్కారం లభించడం, ముఖ్యమంత్రి నుంచి ఆయనకు అభినందనలు లభించడం ఎంతో విశేషం. డాక్టర్ సాయినాథ్‌కు ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించడం పట్ల ఆయన సహచరులు, సంగీతప్రియులు అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఇన్‌స్పెక్టర్ ది గ్రేట్



- భారీ జరిమానాల వసూలులో రికార్డు సృష్టించిన ఎంవిఐ చంద్రశేఖర్‌రెడ్డి
- టార్గెట్‌ను ఛేధించడంలో బెస్ట్ అనిపించుకున్న తడ చెక్‌పోస్ట్

**కొందరు అధికారులు చెత్తశుద్ధితో పని చేసి సొంత ఆదాయాన్ని పెంచుకుంటారు. ఇంకొందరు అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుతారు. తన పనితీరుతో ప్రభుత్వ ఆదాయాన్ని పెంచడంతో పాటు నిబంధనలు అతిక్రమించిన వాహనదారులపై కొరడా ఝుళిపిస్తున్న ఆ అధికారే తడ చెక్‌పోస్టు ఎంవిఐ అల్లూరు చంద్రశేఖర్‌రెడ్డి. విధుల పట్ల అంకిత భావం గల అధికారి.**

తడ చెక్‌పోస్టు అంటే అందరిలో ఒక అభిప్రాయం వుంది. దీనిని చాలామంది అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా భావిస్తుంటారు. ఏదైనా అధికారి పనితీరును బట్టే అది లంచాల వసూలు కేంద్రమా లేక నిబంధనలు అతిక్రమించిన వారి తాటతీసే కేంద్రమా అన్నది ఋజువవుతుంది.

చంద్రశేఖర్‌రెడ్డి తడ చెక్‌పోస్టు రవాణా అధికారిగా బాధ్యతలు చేపట్టాక ఇక్కడ నిబంధనలు ఉల్లంఘించి వాహనాల రాకపోకలు సాగించడం ఆగిపోయింది. అధిక లోడుతో వెళుతున్న వాహనాలు గాని, అనుమతులు లేని వాహనాలు గాని ఆయన కన్ను గప్పి పోలేవు. అధికలోడ్‌తో వెళుతున్న వాహనాలకు అధికంగా జరిమానాలు విధించారు.




గతంలో తడ చెక్‌పోస్టు ఎప్పుడూ లంచాల రూపంలో వార్తల్లో ఉండేది. అలాంటిది ఈ ఏడాది ఎవిఐ చంద్రశేఖర్ రెడ్డి కృషి ఫలితంగా జరిమానాల వసూలులో రాష్ట్రంలోనే టాప్‌లో నిలిచింది. రాష్ట్రంలో దాదాపు 15చోట్ల సరిహద్దు చెక్‌పోస్టులున్నాయి. తడ చెక్‌పోస్టుకు ఈ ఆర్థిక సంవత్సరానికి 14కోట్లు లక్ష్యం విధించగా గడువుకు ముందే చంద్రశేఖర్ రెడ్డి దానిని అధిగమించారు. రాష్ట్రంలో ఎంవిఐలందరికంటే తడ ఎంవిఐకే నెలకు 20.50లక్షల టార్గెట్ ఇచ్చినా ఆయన ఆ లక్ష్యాన్ని దాటి ముందుకెళ్ళారు. ఈ లక్ష్యాన్ని అందుకోవడం గొప్ప కాదు. తడ చెక్‌పోస్టు వద్ద ఎలాంటి వసతులు, సౌకర్యాలు లేకుండానే ఆయన లక్ష్యాన్ని దాటగలిగారు. తడ చెక్‌పోస్టులో ఇద్దరు ఎంవిఐలు ఉండాల్సి వుండగా, ఆయన ఒక్కరే వున్నారు. 9మంది అదనపు ఎంవిఐలు ఉండాలి. కాని ఇద్దరే వున్నారు. 24మంది హోంగార్డులుండాల్సిన చోట 5మందే వున్నారు. ఇక బారికేడ్స్ లేవు, వే బ్రిడ్జి లేదు, ఎలక్ట్రిక్ సౌకర్యాలు లేవు. ఇవన్నీ లేకున్నా కృషి పట్టుదలతో ఎంవిఐ చంద్రశేఖర్‌రెడ్డి టార్గెట్ సాధించారు. ఈ నెల మొదటి రెండు వారాలలోనే ఆయన నిబంధనలు అతిక్రమించి వెళుతున్న వాహనాలకు 84 లక్షల పెనాల్టీ వేసారంటే పనిలో ఎంత దూకుడు చూపిస్తున్నాడో అర్థమవుతుంది. వెల్‌డన్ చంద్రశేఖర్‌రెడ్డి.

# రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రికి 4.20 లక్షల విరాళం

నెల్లూరులోని పొదలకూరు రోడ్డులో ఉన్న రెడ్‌క్రాస్ క్యాన్సర్ వైద్యాలయానికి రామమూర్తినగర్ వాస్తవ్యులు కావల్‌రెడ్డి శ్రీనాథ్‌రెడ్డి సతీమణి శ్రీమతి కావల్‌రెడ్డి ప్రమద 4.20 లక్షల రూపాయలు విరాళంగా అందజేశారు. ఆసుపత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి.లక్ష్మికి ఆ మేరకు ఆ మొత్తాన్ని అందజేశారు. ఆసుపత్రిలోని ఆపరేషన్ థియేటర్‌లో ఆధునిక వైద్య పరికరాల కొనుగోలుకు ఈ విరాళాన్ని వినియోగించవలసిందిగా ఆమె ఈ సందర్భంగా కోరారు. గతంలో కూడా వీరి కుటుంబం నుంచి కావల్‌రెడ్డి శ్రీనాథ్‌రెడ్డి ఈ ఆసుపత్రికి 10 లక్షల విరాళం అందజేసివున్నారు. ఈ కార్యక్రమంలో కావల్‌రెడ్డి శోభ తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ టి.లక్ష్మికి చెక్కును అందజేస్తున్న కావల్‌రెడ్డి ప్రమద



## 'ప్రభా'తం

రాజకీయములందు..ఓట్ల రాజకీయములు వేరయా!.. అన్నట్లు ఇప్పుడు కొత్తగా కర్నాటకలో రాజకీయాలు తారస్థాయికి చేరుకుంటున్నాయి. ఎన్నికలకు సిద్ధమవుతున్న సమయంలో కర్నాటకలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ గతంలో ఎన్నడూ లేని విధంగా ఓట్ల రాజకీయాలను రసవత్తరంగా నడిపేందుకు ఉరకలు వేస్తోంది. కర్నాటకలో బలమైన ఓటు బ్యాంక్‌గా ఉన్న లింగాయత్‌లు, వీరశైవ లింగాయత్‌లను ప్రత్యేక మతంగా గుర్తిస్తూ, మతపరమైన మైనార్టీ హోదాను కల్పించే 'వ్యూహం'పై అక్కడి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం ద్వారా కర్నాటకలో కాంగ్రెస్ కొత్త నాటకానికి తెరలేపినట్లయింది. కర్నాటక మంత్రివర్గం లింగాయత్ సామాజికవర్గాన్ని ప్రత్యేక మతంగా గుర్తిస్తూ తాజాగా చేసిన తీర్మానం దేశవ్యాప్తంగా అలజడి సృష్టిస్తోంది. ఈ నిర్ణయంపై భిన్నాభిప్రాయాలు, వాదోపవాదాలు ప్రారంభం కావడంతో సర్వత్రా రాజకీయాలు మరింత రసకందాయంలో పడ్డాయి. ఎందుకంటే కర్నాటకలో లింగాయత్‌లు రాజకీయంగా ఎంతో ప్రధానమైన పదవుల్లో ఉన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత సుమారు పదిహేనేళ్ల పాటు లింగాయత్‌లే అక్కడ ముఖ్యమంత్రులుగా ఏలారు. అంత ప్రాభవ వైభవాలు లింగాయత్‌లకు ఉన్నాయి. జనాభాలో సుమారు 17 శాతం దాకా ఉన్న లింగాయత్‌లు దాదాపు నూరు నియోజకవర్గాల్లో గెలుపోటములను శాసించే స్థాయిలో ఉన్నారంటే అతిశయోక్తి కాదు. అందుకే, లింగాయత్ సామాజిక వర్గాన్ని మతంగా గుర్తిస్తూ వారికి మతపరమైన మైనార్టీ హోదాను కల్పించాలన్న రిటైర్డ్ జస్టిస్ నాగమోహన్‌దాస్ కమిటీ సిఫారసులకు అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చి, దానిని త్వరలో కేంద్రానికి పంపేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ నిర్ణయానికి సంతోషిస్తూ రాష్ట్రవ్యాప్తంగా లింగాయత్‌లు సంబరాలు చేసుకుంటున్నారు కూడా. అయితే, వీరశైవులు మాత్రం ప్రభుత్వ తీరును నిరసిస్తూ ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పలుచోట్ల ఇరువర్గాల మధ్య స్వల్పంగా ఘర్షణలు కూడా జరిగాయి. ఏదేమైనా, ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం కర్నాటకలోనే కాదు, దేశవ్యాప్తంగా సంచలనం కలిగిస్తోంది. తాము తీసుకున్న ఈ నిర్ణయం ద్వారా తదుపరి మరింత విస్తృతంగా చర్చలు, సంప్రదింపులు జరిపేందుకు కూడా కర్నాటక ప్రభుత్వం సమాయత్తమవుతోంది. అయితే, లింగాయత్‌లు-వీరశైవుల ఈ రిజర్వేషన్ల విధానానికి బిజెపితో సహా పలు హిందూ సామాజికవర్గాలు తొలి నుంచి దూరంగానే ఉంటున్న నేపథ్యంలో, తాజాగా కర్నాటకలో సిఎం సిద్దరామయ్య ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరికాదంటూ బిజెపి విమర్శల బాణాలను ఎక్కుపెట్టింది. రాజకీయ అవసరాల కోసం కర్నాటక ప్రభుత్వం కులాలను, మతాలను విభజిస్తోందంటూ ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తోంది. ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం సిద్దరామయ్య నిప్పుతో చెలగాటమాడుతున్నారని, ఇది మంచిది కాదని బిజెపి హితవు పలుకుతోంది. అసలు వీరశైవులు- లింగాయత్‌లు ఒకటేనని, ఈ రెండు సామాజికవర్గాలు హిందూత్వంలో భాగమేనని, అయితే కర్నాటక ప్రభుత్వం ఎన్నికల్లో గెలిచేందుకు వీరిని విడగొడుతున్నారని, ఇదంతా కర్నాటకలో కాంగ్రెస్ ఆడుతున్న నాటకమే అని బిజెపి దుయ్యబడుతోంది. ఇదిలావుంటే, చాలా కాలంగా లింగాయత్‌లు ప్రత్యేక మతంగా లింగాయత్‌లను గుర్తించాలంటూ కోరుకుంటూనే ఉన్నారు. దీంతో వారికి మతపరమైన మైనార్టీ హోదాను ఇవ్వాలన్న అంశం కూడా ఎంతోకాలంగా అపరిష్కృతంగానే ఉంది. ఇప్పుడు కర్నాటక అసెంబ్లీకి ఎన్నికలు సమీపించిన సందర్భంగా ఈ అంశం లేవనెత్తడం వల్ల తమకెంతో మేలు జరుగుతుందనేది కాంగ్రెస్ రాజకీయం. అక్కడి ముఖ్యమైన నేత యడ్యూరప్ప కూడా లింగాయత్ సామాజికవర్గానికి చెందినవారే కనుక, ఒకే దెబ్బకు రెండు పిట్టలు అన్నట్లుగా, దీంతో ఇటు యడ్యూరప్పను, అటు బిజెపిని కూడా దీనిద్వారా దెబ్బకొట్టవచ్చన్నది కాంగ్రెస్ వ్యూహం. అందువల్ల హఠాత్తుగా లింగాయత్‌లకు ప్రత్యేక మతం పేరుతో మైనార్టీ అంశాలను అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం తెరపైకి తెచ్చిందని రాజకీయవర్గాలు భావిస్తున్నాయి. అసలు వీరశైవులు, లింగాయత్‌లు ఒక్కటేనని, అందరికీ ప్రత్యేక మత హోదా ఇవ్వాలని మరోవైపు అఖిలభారత వీరశైవ మహాసభ సూచిస్తోంది. అయితే, కొంతమంది మాత్రం కేవలం లింగాయత్‌లకు మాత్రమే ఆ తరహా హోదాను ఇవ్వాలని పట్టుబడుతున్నారు. రాష్ట్రంలో 17శాతం దాకా ఉన్న లింగాయత్-వీరశైవ లింగాయత్‌లకు మతపరమైన హోదాను ఇవ్వవచ్చు అని నాగమోహన్‌దాస్ కమిటీ సూచించడంతో ఆ మేరకు గుర్తింపునిచ్చేందుకు అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం తహతహలాడుతోంది. అయితే, ఇక్కడ మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఈ విషయంలో కర్నాటక క్యాబినెట్ నిర్ణయం తుది నిర్ణయమేమీ కాదు. ఆ ప్రతిపాదనకు కేంద్రం నుంచి ఆమోదముద్ర కావాలి. బిజెపికి ఆ ప్రతిపాదన తొలినుంచి ఇష్టం లేదు కనుక అది ఎటూ అమలు జరగదు. ఆ విషయం కర్నాటక ప్రభుత్వనేతలకు తెలియనిదేమీ కాదు. ఎందుకంటే ఈ ప్రతిపాదనను తొలినుంచి బిజెపి వ్యతిరేకిస్తోందని, అందరికీ తెలిసిందే. ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు కావాల్సింది కూడా ఇదే. తాను అడిగినట్లు ఉండాలి..అడిగినా అవతలివారు కాదన్నట్లు ఉండాలి. తాము ఇస్తామన్నా కేంద్రం ఒప్పుకోలేదని చెప్పుకున్నప్పుడే ఓట్లు అటు నుంచి ఇటువైపుకు వచ్చి రాలుతాయన్నది...వ్యూహం. ఇదీ కాంగ్రెస్ రాజకీయం. తీరా ఇవన్నీ ప్రజల్లోకి వచ్చేసరికి ఇందులో ఎంతవరకు ఏ పార్టీవారి మాట నెగ్గుతుందో చూడాలి. ఈ అంశంలో ఇరుకునపడినట్లున్న బిజెపి ఆ పీటముడి నుంచి బయటపడడానికి మరొక వ్యూహంతో పావులు కదుపకుండా ఉంటుందనుకోలేం. అయినా, ఎన్నికలు వస్తున్నాయంటే ఒక్క కర్నాటకలోనే కాదు, దాదాపు దేశమంతటా ఇలాంటి రాజకీయాలే!.. కులాల పేరుతో, మతాల పేరుతో దేశాన్ని ముక్కలు చేసే ప్రయత్నాలు ఏనాటికీ మంచివి కావు. ఎవరైనా సరే, నేతలు ఏ పార్టీ వారైనా సరే ప్రజల ఆశలు ఆకాంక్షలకు తగ్గట్టుగా కార్యాలు నిర్వర్తించాలే తప్ప ఓట్లకు తగ్గట్టుగా నిర్ణయాలు చేయడం తగదు!... ఇలాంటి రాజకీయాలు చివరికి ఎలాంటి ఫలితాలిస్తాయో వేచి చూడాల్సిందే.

### దేశాన్ని ఇంకా ముక్కలు చేస్తారా?

తమ రాష్ట్రంలో 17శాతం దాకా ఉన్న లింగాయత్-వీరశైవ లింగాయత్‌లకు మతపరమైన గుర్తింపునిచ్చేందుకు కర్నాటక ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సంచలనమే. అయితే, కేంద్రం అందుకు అనుమతిస్తుందన్న గ్యారంటీ ఏమీ లేదు. అక్కడి కాంగ్రెస్‌కు కావాల్సింది కూడా ఇదే. తాము అడిగినట్లు ఉండాలి.. అవతలివారు కాదన్నట్లు ఉండాలి. అప్పుడే ఓట్లు అటు నుంచి ఇటు రాలుతాయన్నది కాంగ్రెస్ వ్యూహం. ఇలాంటి ఓట్ల రాజకీయాలు చివరికి ఎలాంటి ఫలితాలిస్తాయో వేచిచూడాల్సిందే మరి!..

## నేత్రపర్వంగా ఇరుకళల పరమేశ్వరి నగరోత్సవం



సింహపురి గ్రామ దేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారికి ఈ నెల 18న నగరోత్సవం నేత్రపర్వంగా సాగింది. అమ్మవారికి ఉదయం విశేష పూజలు నిర్వహించారు. రాత్రి 7గంటలకు ప్రారంభమైన నగరోత్సవం నెల్లూరు నగర పురవీధుల్లో వైభవంగా కొనసాగింది. దారిపొడవునా రంగవల్లులతో కర్పూర హారతులు ఇచ్చి టెంకాయలు కొట్టి మహిళా భక్తులు విశేషపూజలు నిర్వహించారు. మేళతాళాలతో, మంగళవాయిద్యాలతో బాణాసంచా వేడుకలతో నగరోత్సవం వైభవంగా సాగింది. ఈ సందర్భంగా కాకర్లవారివీధి మిత్రమండలి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. రంగనాయకులపేట శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానం ఆలయ ఛైర్మెన్ మంచికంటి సుధాకర్‌రావు ఇరుకళల పరమేశ్వరికి సారె సమర్పించారు. ఇ.ఓ వేమూరి గోపి ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

## నెరసం ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు



కోట సునీల్‌కు ఉగాది పురస్కారాన్నందజేస్తున్న నెరసం సభ్యులు

నెల్లూరుజిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 17న నెల్లూరు టౌన్‌హాలు వర్ధమాన సమాజంలో ఉగాది వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమాన్ని ఇస్కాన్ ఇన్‌ఛార్జి శుకదేవస్వామి భజనతో ప్రారంభించారు. అనంతరం కోట సునీల్‌కుమార్‌కు సంస్థ తరపున ఉగాది పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ భగవంతుడుని సేవించుకోవడం మానవ ధర్మమన్నారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికంగా మెలగాలన్నారు. సభకు నెరసం అధ్యక్షులు ఎ.జయప్రకాష్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా నెల్లూరు నగర ఎస్‌డిపిఓ ఎస్‌డిఎం మురళీకృష్ణ పాల్గొన్నారు. సభ నిర్వహణ, కవి సమ్మేళనాన్ని నెరసం ప్రధాన కార్యదర్శి పాతూరి అన్నపూర్ణ నిర్వహించారు. మరో ఉగాది పురస్కారాన్ని నారాయణ డెంటల్ కాలేజ్ ప్రొఫెసర్ డా॥ యం.కణ్ణన్‌కు అందజేశారు. ఆత్మీయ పురస్కారాన్ని కథా రచయిత వడలి రాధాకృష్ణ(చీరాల)కు అందజేశారు. ములుగు విజయదుర్గ, షేక్ సత్తార్, ఐ.నాగరాజారావు, అన్నం శివకృష్ణ, గోశాల నిర్వాహకులు బి.లక్ష్మిలను సత్కరించారు. నెరసం ఉపాధ్యక్షులు మాటేటి రత్నప్రసాద్ వందన సమర్పణ చేశారు.




## పచ్చి అవకాశవాది

చంద్రబాబునాయుడు లాంటి పచ్చి అవకాశవాద రాజకీయ నాయకుడు ఈ లోకంలో ఇంకొకరు ఉండరు. 2014 ఎన్నికల్లో మాత్రం బీజేపీ అధిష్టానంపై ఒత్తిడి తెచ్చి పొత్తు పెట్టుకున్నాడు. ఆరోజు నరేంద్ర మోదీ ఇమేజ్ ప్రజల్లో బ్రహ్మాండంగా వుందని ఆయనకు తెలుసు. బీజేపీతో పొత్తు ఓట్ల పరంగా కలిసొస్తుందనుకున్నాడు. అందుకే బలవంతం చేసి మరీ పొత్తు పెట్టుకున్నాడు. మొన్నటివరకు మోదీ ఇమేజ్ వుందనుకునే ప్రత్యేకహోదా లేదన్నా ప్రత్యేకప్యాకేజీకి ఒప్పుకున్నాడు. యూపిలో ఎప్పుడైతే కంచుకోటల్లాంటి రెండు లోక్‌సభ స్థానాల్లో బీజేపీ ఓడిపోయిందో అప్పుడే చంద్రబాబు ఎన్డీఏకు గుడ్‌బై చెప్పేసాడు. వచ్చే ఎన్నికల్లో నరేంద్ర మోదీపై ప్రజల్లో వున్న వ్యతిరేకత తనపై పడకుండా చూసుకునేందుకే చంద్రబాబు ఈ ఎత్తుగడ వేసాడు.

**డి.కిషోర్‌వందన్, బెంగుళూరు.**

## ఇన్ని నాలుకలా?

చంద్రబాబు మాటలను చూస్తుంటే ఒక మనిషికి ఇన్ని నాలుకలుంటాయా అనిపిస్తుంది. కేంద్రంపై పార్లమెంట్‌లో వైసిపి ప్రవేశపెట్టాలనుకున్న అవిశ్వాస తీర్మానానికి మద్దతిచ్చేది లేదని, తాము ఎన్డీఏలో భాగస్వామిగా వున్నామని మొదట చెప్పారు. ఆ పక్కరోజే మాటమార్చి అవిశ్వాస తీర్మానానికి మద్దతిస్తామన్నారు. మరుసటి రోజే నాలుకను మరోసారి మడతపెట్టారు. ఎన్డీఏ నుండి బయటకొచ్చి తానే అవిశ్వాస తీర్మానం పెడతానన్నాడు. ఒక నాయకుడిలో ఇన్ని కోణాలా?

**పత్తి సురేష్, నెల్లూరు.**

## ఇంతకాలం కొమ్ము కాసినట్లేగా?

రాష్ట్ర ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని, సీఎం తనయుడు, మంత్రి నారా లోకేష్ అవినీతికి పాల్పడుతున్నాడని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆరోపణలు చేసాడు. రాష్ట్ర ప్రభుత్వ అవినీతి చర్యలు ఈ నెలలోనో, ఈ వారంలోనో జరిగినవి కావు. నాలుగేళ్లుగా అవినీతి, అక్రమాలు జరుగుతూనే వున్నాయి. తహశీల్దార్ వనజాక్షిని ఈరోజుకీరోజు ఇసుకలో ఈడ్చి కొట్టలేదు. మూడేళ్ల క్రితం ఈ సంఘటన జరిగింది. అక్షరం ముక్క రానివాళ్ళకు కూడా ఈ రాష్ట్ర ప్రభుత్వ అవినీతి అక్రమాల గురించి ఎప్పుడో తెలుసు. పవన్ కళ్యాణే చాలా ఆలస్యంగా తెలుసుకున్నాడు.

**కంచి నాగరాజు, నెల్లూరు.**

# అన్ని సీట్లూ ఇక తమ్ముళ్ళకే!

## బీజేపీతో కటీఫ్ ఫలితం

**ఎన్డీఏ కూటమి నుండి తెలుగుదేశం వైదొలిగింది. దీనిపై నెల్లూరుజిల్లా తెలుగు తమ్ముళ్ళు రెండు విధాలుగా హర్షం వ్యక్తం చేస్తున్నారు. బీజేపీ మతోన్మాద పార్టీ అని, అందుకే దూరంగా వచ్చేసామని ముస్లింలు, క్రిస్టియన్‌ల దగ్గరకుపోయి ఓట్లు అడగొచ్చు. నోట్ల రద్దు, జిఎస్టీ వంటి వాటి ప్రభావాన్ని బీజేపీ మీదకు తోసేయవచ్చు. రెండోది పొత్తులో భాగంగా బీజేపీకి ఇచ్చే సీట్ల నుండి ఇక తెలుగు తమ్ముళ్ళే పోటీ చేయవచ్చు. అది లోక్‌సభ అయినా, శాసనసభ అయినా, జడ్పీటీసీ అయినా, మున్సిపల్ వార్డు మెంబర్ అయినా!**

ప్రతి ఎన్నికలలోనూ పొత్తులో భాగంగా బీజేపీకి ఒకటి, అరా సీట్లివ్వడం, ఆ పార్టీ ఓడిపోవడం జరుగుతూ వస్తోంది. 1985లో టీడీపీ-బీజేపీ పొత్తుకు బీజం పడింది. ఆ ఎన్నికల్లో పొత్తులో భాగంగా బీజేపీకి ఆత్మకూరు సీటిచ్చారు. ఆ పార్టీ అభ్యర్థిగా వెంకయ్యనాయుడే ఓడిపోయాడు. 1989ఎన్నికల్లోనూ మళ్ళీ పొత్తు ధర్మంగా ఆత్మకూరునే ఆ పార్టీకిచ్చారు. ఈసారి కూడా ఆ పార్టీ అభ్యర్థి కర్నాటి ఆంజనేయరెడ్డి గెలిచినంత పనిచేసి ఓడిపోయాడు. ఆ తర్వాత టీడీపీ-బీజేపీల మధ్య పొత్తు తెగిపోయింది. మళ్ళీ 1999 ఎన్నికల్లో కలిసారు. ఆ ఎన్నికల్లో సిటింగ్ ఎమ్మెల్యే టి.రమేష్‌రెడ్డికి చెక్ పెట్టాలని నిర్ణయించుకున్న చంద్రబాబు నెల్లూరు సీటును బీజేపీకి ఇచ్చాడు. ఆ ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థిగా డేగా నారసింహారెడ్డి పోటీ చేసి ఓటమి పాలయ్యాడు. నెల్లూరు నగరంలో తెలుగుదేశం పతనం అప్పుడే మొదలైంది. మళ్ళీ 2004 ఎన్నికల్లోనూ పొత్తులో భాగంగా నెల్లూరు లోక్‌సభ స్థానంతో పాటు నెల్లూరు అసెంబ్లీ సీటును, అలాగే ఆత్మకూరు అసెంబ్లీ సీటును బీజేపీకివ్వడం జరిగింది. ఆ ఎన్నికల్లో మూడు చోట్లా పరాభవమే! 2009 ఎన్నికల్లో బీజేపీతో పొత్తు లేకున్నా వామపక్షాలతో పొత్తు పెట్టుకున్న టీడీపీ నెల్లూరురూరల్ సీటును సీపీఎంకు ఇవ్వడం తెలిసిందే! ఇక్కడా సీపీఎం ఓడిపోయింది. 2014 ఎన్నికలకొచ్చే సరికి మళ్ళీ బీజేపీతో పొత్తు ముడిపడిపోయింది. ఈసారి తిరుపతి లోక్‌సభ, నెల్లూరురూరల్ అసెంబ్లీ సీట్లు బీజేపీకి ఇచ్చారు. రెండు చోట్లా పరాజయమే!

ఇలా అన్ని ఎన్నికల్లోనూ టీడీపీలో వున్న ఆశావహులను పక్కనపెడుతూ బీజేపీకి సీట్లిస్తూ వచ్చారు. ఇప్పుడు చంద్రబాబు ఎన్డీఏ నుండి బయటకు రావడంతో ఆ సమస్య లేదు. ఆ పార్టీకి సీట్లిచ్చే పని లేదు. కాబట్టి తెలుగుదేశం నాయకులకే ఆ సీట్లు దక్కనున్నాయి.



### ఎమ్మెల్యే ఆడపడుచులకు

# వెంకటగిరి చీరలు

**- అన్న సోమిరెడ్డి ఉగాది కానుక**

అచ్చతెలుగు పంచెకట్టుతో అచ్చుగుద్దినట్లు రైతు వేషధారణతో అసెంబ్లీలో రైతు బడ్జెట్ ప్రవేశపెట్టడానికి వెళుతున్నప్పుడు తనకు ఎదురొచ్చి సాగనంపారనే కృతజ్ఞతతో ఏమోగాని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలుగుదేశం మహిళా ఎమ్మెల్యేలకు ఉగాది సందర్భంగా వెంకటగిరి చీరలను బహుకరించారు. ఉగాది పండుగను బాగా జరుపుకోండంటూ ఆయన అసెంబ్లీ ఆవరణలో వారందరికీ ఈ చీరలు అందజేయడం జరిగింది.

### అన్నదాతలారా అధైర్యపడకండి...

# తడిసిన ధాన్యం కొంటాం

**కలెక్టర్ ముత్యాలరాజు**



అకాల వర్షాలతో జిల్లా రైతులు నష్టపోకుండా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు ఒక ప్రకటనలో తెలిపారు. అకాలవర్షంపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పురపాలక మంత్రి డా. నారాయణ, జాయింట్ కలెక్టర్‌లతో చర్చించామని, అకాలవర్షాల బారిన పడిన రైతాంగాన్ని ఆదుకునేందుకు కృషి చేస్తున్నామన్నారు. జిల్లాలో ఇటీవల అకాలవర్షం కురిసి 26.7 మి.మి వర్షపాతం నమోదైందన్నారు. బాలాయపల్లి మండలంలో 120 మి.మి, అదేవిధంగా మర్రిపాడులో 93.6, సైదాపురంలో 88.4, దుత్తలూరులో 57.4, నాయుడుపేటలో 52.4, వింజమూరు-రాపూరుల్లో 46.2, పెళ్ళకూరు మండలంలో 44.8 మి.మీ వర్షపాతం నమోదైందని, వెంటనే రెవెన్యూ, వ్యవసాయశాఖ ఉద్యోగులను బృందాలుగా నియమించి పంట నష్టాలను పరిశీలించామన్నారు. ఆ మేరకు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకున్నామన్నారు. పలు ప్రాంతాల్లో తడిసివున్న ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించే ఏర్పాట్లు చేశామన్నారు. ఈనెల 17న జిల్లాలో 2398 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు.

ఇప్పటిదాకా మొత్తం 18,385 టన్నుల ధాన్యం (29.22 కోట్లు) కొనుగోలు చేశామని, మరో 8832 టన్నుల ధాన్యానికి రూ.14.03 కోట్ల రూపాయలను రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమచేశామన్నారు. రైతులు అధైర్యపడవద్దని, ఎంత ధాన్యాన్నయినా కొనుగోలు చేస్తామని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

# హోదాకై హారం



ప్రత్యేకహోదా ఆంధ్రుల హక్కు అంటూ నినదిస్తున్న ఎమ్మెల్యే అనిల్



గాంధీబొమ్మ సెంటర్‌లో వైకాపా నాయకుల మానవహారం

ప్రత్యేకహోదా పోరాటంలో భాగంగా 19వ తేదీ వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ప్రతి మండలంలోనూ ప్రజా సంకల్ప మానవహారాలను నిర్వహించారు. నెల్లూరునగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో నెల్లూరులోని గాంధీ బొమ్మ వద్ద పెద్దఎత్తున మానవహారం నిర్వహించారు. లంచాల ప్యాకేజీ కోసం ప్రత్యేకహోదాను వద్దన్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రజలు బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని ఈ సందర్భంగా అనిల్ పేర్కొన్నారు.

వెంకటాచలం సెంటర్‌లో సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి నాయకత్వంలో మానవహారం నిర్వహించారు. ఏపికి ప్రత్యేకహోదా ఇచ్చే వరకు తమ పోరాటం ఆగదని ఈ సందర్భంగా కాకాణి పేర్కొన్నారు. వెంకటగిరిలో జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి ఆధ్వర్యంలో మానవహారం నిర్మించారు. ప్రత్యేకహోదాపై చంద్రబాబు పూటకో మాట మాట్లాడుతున్నాడని ఆయన ఎద్దేవా చేశారు. కావలి రూరల్ మండలం తుమ్మలపెంటలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో, సూళ్ళూరుపేటలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య నాయకత్వంలో, ఆత్మకూరులో ఎమ్మెల్యే మేకపాటి గౌతంరెడ్డి ఆధ్వర్యంలో, గూడూరులో వైసిపి నాయకులు మేరిగ మురళీ, ఎల్లసిరి గోపాల్‌రెడ్డిల నాయకత్వంలో, ఉదయగిరిలో మండల వైసిపి నాయకులు ఏ.భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో మానవహారాలు నిర్వహించి ప్రత్యేకహోదా కావాలంటూ నినదించారు. పెద్దఎత్తున వైకాపా కార్యకర్తలు పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు




శ్రీ షిర్డి సాయిబాబా వారి శ్రీరామనవమి జన్మదిన మహోత్సవములు

25-3-2018 ఆదివారం నుండి 27-3-2018 మంగళవారం వరకు

పై దినములలో ప్రతిరోజు ఉదయం 7.30 గం॥ల నుండి శ్రీ బాబా వారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకములు, సామూహిక అష్టోత్తర సహస్రనామ పూజలు జరుగును. పై పూజలలో పాల్గొను భక్తులు మందిర గుమస్తా వద్ద రూ.75/-రూ. చెల్లించి తగిన రశీదును పొందవలసినదిగా కోరడమైనది.

- 25-03-2018: శ్రీ గురుకృపా కళాక్షేత్రం వారిచే సాయంత్రం 7గం॥ల నుండి సాంస్కృతిక కార్యక్రమం జరుగును.
- 26-03-2018: భక్తజన బృందంచే శ్రీలక్ష్మి మరియు శ్రీ విష్ణు సహస్ర నామ సామూహిక పారాయణము సాయంత్రం 6గంటలకు
- 27-03-2018: ఓం బ్రహ్మశ్రీ సద్గురు శివకేశవ జగన్నాథ భజన సమాజము, చీరాల వారిచే సమర్థ సద్గురు శ్రీ సాయిబాబా వారి చాలీసా పారాయణము సాయంత్రం 6 గంటలకు

26-03-2018 మరియు 27-03-2018: పారాయణములలో పాల్గొను భక్తులు తమ పేర్లను మందిర గుమస్తా వద్ద నమోదు చేసుకోవలసిందిగా మనవి.

ఇట్లు: కార్యవర్గము

శ్రీ షిర్డి సాయిబాబా మందిరము
గాంధీనగర్, ట్రంకురోడ్డు, నెల్లూరు. ఫోన్. 2327771.

# విపిఆర్‌కు మహిళా నేతల అభినందనలు



వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని అభినందిస్తున్న వైసిపి మహిళా విభాగం అధ్యక్షురాలు మొయిళ్ళ గౌరి, ఇతర నాయకురాళ్ళు

రాజ్యసభ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి వైయస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంటరీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు మెయిళ్ళ గౌరి ఆధ్వర్యంలో మహిళా నేతలు ఈ నెల 17న పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. నెల్లూరు కనుపర్తిపాడులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర అధ్యక్షురాలు తోట శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

# ఎంఎస్ఆర్ సేవాసమితి బైక్‌ర్యాలీ



బైక్‌ర్యాలీలో పాల్గొన్న మాగుంట శరత్‌చంద్రారెడ్డి(చందు)

మాగుంట శరత్‌చంద్రారెడ్డి సేవాసమితి ఆధ్వర్యంలో ప్రత్యేకహోదా సాధనకు ఈ నెల 20న నెల్లూరులో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాగుంట శరత్ చంద్రారెడ్డి(చందు) మాట్లాడుతూ ఏపి ఎంపీలు అందరూ పార్టీ జెండాలు పక్కనపెట్టి ఢిల్లీలో కలిసికట్టుగా పోరాడాలని కోరారు. యువత స్వచ్ఛంధంగా కలసివచ్చి ప్రత్యేకహోదా సాధనలో భాగస్వాములు కావాలన్నారు. ప్రత్యేకహోదా కోసం పోరాడేవారందరికీ తమ మద్దతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఆర్ సేవాసమితి కార్యనిర్వాహకులు లేకిన్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, మహేష్, అశోక్, నౌషాద్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఫ్రెండ్స్ వాకర్స్ ఉగాది సంబరాలు



ఉగాది వేడుకల్లో పాల్గొన్న ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

విళంబి నామ సంవత్సర ఉగాది సంబరాలను ఈ నెల 18న నెల్లూరు ఏ.సి. సుబ్బారెడ్డి స్టేడియంలో ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు నలుబోలు బలరామయ్యనాయుడు, కార్యదర్శి వినుకొండ వెంకటేశ్వర్లు, కోశాధికారి కొండూరు సుబ్బారావు వాకర్స్ మిత్రులకు శుభాకాంక్షలు తెలియజేసి దాదాపు 800మందికి ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. అలాగే సంప్రదాయ దుస్తుల్లో వచ్చిన వారికి కండువాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వాకర్స్ మాజీ గవర్నర్ మైథిలి మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు. బలరామయ్యనాయుడు విళంబి నామ సంవత్సర ప్రాశస్త్యం గురించి, ఉగాది పచ్చడి, పంచాంగం గురించి వాకర్స్ మిత్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు జి.వి.కృష్ణయ్య, సాయి సుబ్బారావు, సంయుక్త కార్యదర్శులు డి.జయ రామానాయుడు, లక్కాకుల శ్రీనివాసులు, సభ్యులు రాజారావు, ఏ.శేషయ్య, పిగిలాం రంగయ్య, డా॥ కె.సూర్యనారాయణ, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

### ఏఐసిసిలో

# ఏకంగా 9స్థానాలు

ఒకప్పుడు ఏఐసిసిలో సభ్యత్వం అంటే కాంగ్రెస్ నాయకులకు పెద్ద పదవి లెక్క! ఎంపి, ఎమ్మెల్యే స్థాయి నాయకులకు మాత్రమే ఏఐసిసిలో సభ్యత్వం లభించేది. అలాంటిది ఇప్పుడు నెల్లూరుజిల్లా నుండి 9మంది నాయకులను ఏఐసిసిలో సభ్యులుగా నియమించారు. పనబాక కృష్ణయ్య, సి.వి.శేషారెడ్డి, చేవూరు దేవకుమార్‌రెడ్డి, పి.చెంచలబాబుయాదవ్, పత్తి సీతారాం బాబు, రవిచంద్రారెడ్డి, భవానీ నాగేంద్ర ప్రసాద్, జహంగీర్‌లను ఏఐసిసి సభ్యులుగా నియమిస్తూ ఏఐసిసి అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఉత్తర్వులు జారీ చేశారు.

### 26 నుండే

# హెల్మెట్ పెట్రోల్




ద్విచక్రవాహనదారులు హెల్మెట్ పెట్టుకుంటేనే పెట్రోల్ వట్టాలనే నిబంధనను ఈ నెల 26వ తేదీ నుండి అమలు చేస్తామని జిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రమాదాలను అరికట్టడానికి, ప్రమాదాలలో ప్రాణాలు కోల్పోకుండా చూడడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని, ఈ నిర్ణయాన్ని పకడ్బందీగా అమలు చేయడానికి పోలీసు శాఖ సిద్ధంగా ఉందని, హెల్మెట్ లేకుంటే పెట్రోల్ పట్టొద్దని ఇప్పటికే అన్ని పెట్రోల్ బంకుల యజమానులకు ఆదేశాలు జారీ చేసామని, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపేవాళ్ళపై కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

# ఎస్సైల బదిలీలు

జిల్లాలో నలుగురు ఎస్.ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ రామకృష్ణ ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరురూరల్ ఎస్.ఐ శేఖర్ బాబును గూడూరు వన్‌టౌన్‌కు పంపారు. ఆత్మకూరు ఎస్.ఐ షేక్ ఖాజీబాబును విఆర్‌కు ఆదేశించి గూడూరు రెండో పట్టణ ఎస్.ఐ పి.నరేష్‌ను ఆత్మకూరుకు వేశారు. విఆర్‌లో ఉన్న ఎన్.మధుసూదన్‌రెడ్డిని సిసిఎస్ ఎస్.ఐగా నియమించారు.

# నెల్లూరు కబుర్లు

# వెంకయ్య పర్యటన రద్దయ్యింది



ఈ నెల 24న ఉండాల్సిన ఉపరాష్ట్రపతి యం.వెంకయ్య నాయుడు నెల్లూరు పర్యటన రద్దయ్యింది. ఆరోజు నెల్లూరొచ్చి ఆయన వెంకటేశ్వరపురంలోని యాష్‌పాండ్ వద్ద నిర్మించిన 'హౌస్‌ఫర్ ఆల్' గృహ సముదాయాలను ప్రారంభించాలి. షెడ్యూల్ ప్రకారం ఆరోజు రాత్రికి స్వర్ణభారత్ ట్రస్ట్‌లో బస చేసి పక్కరోజు పొద్దున వెళ్ళిపోవాలి. అయితే రాష్ట్రంలో మారిన రాజకీయ వాతావరణ నేపథ్యంలో ఈ కార్యక్రమాలు వాయిదా పడ్డట్లుగా తెలుస్తోంది. వెంకయ్య పర్యటన రద్దు కావడంతో ఆటోమేటిక్‌గా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన కూడా ఆగిపోయింది.

### శ్రీ సాయిదర్బార్‌లో...

# షిరిడిసాయి బంగారు పాదుకలు



నెల్లూరు బాలాజీనగర్ చివర పద్మావతినగర్‌లోని శ్రీ సాయిదర్బార్ అద్దాల మందిరంలో ఉగాది, శ్రీరామనవమి ప్రారంభ వేడుకలు ఈ నెల 17న వైభవంగా జరిగాయి. షిరిడిలో శ్రీ సాయినాథ్ మహరాజ్ పాదముల వద్ద, బాబా సమాధి వద్ద పూజించిన బంగారు పాదుకలు నెల్లూరులో సాయి భక్తులు దర్శించుకునేందుకు శిరిడి నుండి చీర్ల చిన్నారెడ్డి శ్రీ సాయిదర్బార్‌కు తీసుకువచ్చారు. ఈ బంగారు పాదుకలు ఈ నెల 26వ తేదీ శ్రీరామనవమి రోజున బాబా వారు తపస్సు చేసిన వేపచెట్టు క్రింద గురుస్థాన్‌లో శిరిడి సాయి సంస్థాన్ వారు ప్రతిష్ఠించనున్నారు. నెల్లూరు వాస్తవ్యుడు చీర్ల చిన్నారెడ్డి ఈ బంగారు పాదుకలను తన స్వంత ధనంతో తయారు చేయించి శిరిడిలో శ్రీ సాయిబాబాకు సమర్పిస్తున్నారు. బంగారు పాదుకలకు సాయి దర్బార్ మందిరంలో విశేషపూజలు, శ్రీ సాయినామ సంకీర్తనలు వేద మంత్రోచ్ఛారణలు జరిగాయి. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని పాదుకలను దర్శించి, నమస్కరించుకున్నారు. బంగారు పాదుకలకు మందిర ఛైర్మెన్ మధుసూదనసాయి, అర్చకులు పూర్ణకుంభంతో ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

# నెల్లూరు పోలీసులకు ఉగాది పురస్కారాలు

పోలీసు శాఖలో అందించిన అత్యుత్తమ సేవలకు జిల్లా ఏఎస్పీ బి.శరత్‌బాబు ఏపి పోలీస్ మహోన్నత సేవా పతకం అందుకున్నారు. అలాగే మరో 20మంది పోలీసు అధికారులు, సిబ్బందికి ఉగాది సందర్భంగా పోలీసు సేవా పతకాలు దక్కాయి. పతకాలు పొందిన వారిలో ఏ.రాధాసింగ్, టి.పి.విఠలేశ్వర్, బాజీజాన్ సైదా, ఎస్.కె.బషీర్, అల్లూరు రాజా, కె.కోటేశ్వరరావు, కె.దశరథరామయ్య, ఎస్.డి.కరీం, ఎస్.గోవర్ధన్‌రావు, ఎస్.డి.వారిస్, కె.వి.కృష్ణయ్య, కె.గిరిధర్‌రావు, ఆర్.మల్లిఖార్జున, వై.రమణయ్య, ఎస్.కె.అబ్దుల్‌రహీం, ఐ.ధర్మారావు, డి.ఫణిప్రసాద్‌లు వున్నారు.

# విఆర్ కళాశాలలో అకడమిక్ ఆడిట్



నెల్లూరు విఆర్ కళాశాలలో కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ విజయవాడ వారి ఉత్తర్వులు ప్రకారం ఈ నెల 15, 16తేదీలలో అకడమిక్ ఆడిట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యానగర్ ఎన్‌బికెఆర్ కళాశాల తెలుగు రీడర్ డాక్టర్ టి.మాలకొండయ్య, కావలి జవహర్ భారతి డిగ్రీ కళాశాల కెమిస్ట్రీ రీడర్ డాక్టర్ ఎమ్.వి.భాస్కర్‌రెడ్డి అకడమిక్ అడ్వైజర్లుగా వ్యవహరించారు. వారు రెండురోజుల పాటు కళాశాలలోని సంబంధించిన అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి నివేదికను రూపొందించారు. విద్యార్థులతో సమావేశమై కళాశాలలోని బోధన గురించి సౌకర్యాల ఏర్పాట్లు గురించి చర్చించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ డాక్టర్ సివిఎస్ భాస్కర్ అధ్యక్షత వహించారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.అశోక్‌రావు, ఐక్యూఏసి కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం, యూజీసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.బాబర్ ఆలీ మొహిద్దీన్, లైబ్రేరియన్ డాక్టర్ నరమాల ప్రభాకర్, ఫిజికల్ డైరెక్టర్ ఎం.రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

# కరువును తరిమేసాం...

## - రైతు మంత్రి సోమిరెడ్డి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

రాష్ట్రంలో రైతన్నను కష్టం నష్టం తెలియకుండా ఆదుకుంటామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. 19వ తేదీ నెల్లూరు ఆర్ అండ్ బి అతిథిగృహంలో ధాన్యం కొనుగోలుపై వ్యవసాయ, రెవెన్యూ, మార్కెటింగ్ తదితర శాఖాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహిం చారు. జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితు లున్నప్పటికీ 7లక్షల ఎకరాలకు సాగునీరిచ్చి కరువును తరిమికొట్టామన్నారు. జిల్లాలోని రైస్ మిల్లుల యాజమాన్యం నుండి 150 కోట్ల రూపాయల బ్యాంకు గ్యారంటీలు తీసుకోవాలని దీనికి సంబంధించిన కమిటీని కూడా వేసామన్నారు. ఇప్పటి వరకు బ్యాంకర్లు 30కోట్ల రూపాయల వరకే బ్యాంకు గ్యారంటీలు ఇచ్చారని, మిల్లర్లు వద్ద నుండి వెంటనే బ్యాంకు గ్యారంటీలు తీసుకుని రైతుల దగ్గర నుండి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించాలన్నారు. ఇటీవల జిల్లాలో కురిసిన వర్షాలకు ధాన్యం తడిసి వున్నా కూడా ప్రకటించిన మద్దతు ధరకు తీసు కోవాలన్నారు. 2015-16, 2016-17 సంవత్సరాల్లో ధాన్యానికి డిమాండ్ ఎక్కువగా వుందన్నారు. 2015-16 సంవత్సరంలో 3లక్షల 35వేల మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని, 2016-17 సంవత్స రంలో 25వేల మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని రైతుల దగ్గర నుండి సేకరించామన్నారు. ఈ సంవత్సరం బయట రాష్ట్రాల నుండి డిమాండ్ తగ్గిందని, శ్రీలంక లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం కొరకు ఆర్డర్ ఇచ్చిందని, మరో లక్ష మెట్రిక్ టన్నులు ఆర్డరు కొరకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు.

జాయింట్ కలెక్టర్ ఎఎండి ఇంతి యాజ్ మాట్లాడుతూ జిల్లాలో 168 పిపిసిల సెంటర్లు వున్నాయని, 94 సెం టర్లు యాక్టివ్‌గా జరుగుతున్నాయని తెలి పారు. కొత్తవెల్లంటి, కోవూరు, ఆత్మకూరు, ఎ.ఎస్.పేట, మహిమలూరు, సంగం, దువ్వూరు, దామా నెల్లూరు, నాయుడుపేట, తదితర పిపిసి కేంద్రాల్లో కొనుగోళ్ళు బాగా జరుగుతున్నాయని తెలిపారు. ఈ సమా వేశంలో ఎంఎల్‌సి బీద రవిచంద్ర, మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మాజీశాసనసభ్యులు శ్రీధర కృష్ణారెడ్డి, రైతు సంఘం నాయకులు, మార్కెటింగ్ ఎ.డి. ఉపేంద్ర, జె.డి. అగ్రికల్చర్ చంద్రనాయక్, జిల్లా సహకార అధికారి సుధాభారతి, అధికారులు, తది తరులు పాల్గొన్నారు.

## కృష్ణపట్నం పోర్టులో...

# జాతీయ స్థాయి కాంక్రీట్ కనోయింగ్ పోటీలు





పోటీలను ప్రారంభిస్తున్న కేపిసిఎల్ మెరైన్ ప్రెసిడెంట్ కెప్టెన్ ప్రదీప్‌గౌర్

అమెరికన్ సొసైటీ ఆఫ్ సివిల్ ఇంజ నీర్స్‌కి చెందిన ఇండియా స్టూడెంట్ సెక్షన్ ఆధ్వర్యంలో కృష్ణపట్నం పోర్టులో ఈ నెల 17న నిర్వహించిన జాతీయ స్థాయి కాంక్రీట్ కనోయింగ్ పోటీలను కేపిసిఎల్ మెరైన్ ప్రెసిడెంట్ కెప్టెన్ ప్రదీప్‌గౌర్, పిఆర్ హెడ్ వేణుగోపాల్ ప్రారంభించారు. దేశం లోని వేలూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల, చెన్నైకి చెందిన బన్నారీ అమ్మన్ ఇన్‌స్ట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల, బెంగుళూరుకు చెందిన ఆర్‌వి ఇంజనీరింగ్ కాలేజీ, పంజాబ్ ఇంజనీరింగ్ కాలేజీ, నార్సీముంజి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ (ముంబయి) కళాశాలలకు చెందిన సివిల్ ఇంజనీర్ విద్యార్థులు 150మంది పోటీల్లో పాల్గొన్నారు. వీరందరూ కృష్ణపట్నం పోర్టు లోనే తమ కనోయింగ్ బోట్లను కాం క్రీట్‌తో స్వయంగా తయారు చేసుకున్నారు. తయారుచేసిన కనోయింగ్ పడవలను ప్రదర్శనకు వుంచారు. జాతీయ స్థాయి పోటీల్లో భాగంగా కాంక్రీట్ కనోయింగ్ పడవలను మూడు విభాగాల్లో పరీక్షించి విజేతలను ఎంపిక చేశారు. తొలుత డిజై నింగ్ టెస్టింగ్, ఫ్లోటింగ్ టెస్టింగ్, రైడింగ్ లలో ఐదు కళాశాలల విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఆసక్తికరంగా జరి గిన కనోయింగ్ పోటీల్లో వేలూరు ఇన్స్ ట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(విట్) విద్యార్థులు విజేతలుగా నిలిచి అమెరికాలో జరగనున్న అంతర్జాతీయ పోటీల్లో ప్రాతినిధ్యం వహిం చనున్నారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వరంగల్ విట్ కళాశాల సివిల్ ఇంజనీ రింగ్ విభాగ అధిపతి గర్జేష్‌కుమార్, ముంబయి ఐఐటి సివిల్ ఇంజనీరింగ్ విభాగ అధిపతి బాలాజీలు వ్యవహరిం చారు. కార్యక్రమంలో కేపిసిఎల్ సిఓఓ సుబ్బారావు, కెప్టెన్ రవీంద్ర, బాబు రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

# వంద కోట్లతో రోడ్లు, డ్రెయిన్లు



సభలో మాట్లాడుతున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరురూరల్ నియోజక వర్గంలోని 14గ్రామాల్లో ప్రభుత్వం రూ.100కోట్లతో రోడ్లు, డ్రెయిన్లు తదితర మౌలిక వసతులను కల్పిస్తోందని తెలుగుదేశంపార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 18వ తేదీ ఆదివారం 18వ డివిజన్ పరిధిలోని నక్కలగుంటలో ఆయన దళిత తేజం - తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ తర్వాత రూరల్ నియోజక వర్గంలోని ప్రతి ప్రాంతంలో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలను పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, టిడిపి నాయకులు ఆనం జయకుమార్‌రెడ్డి, స్వర్ణ వెంకయ్య, హరిబాబుయాదవ్, జెన్ని రమణయ్య, దారా వంశీకృష్ణ, కోడూరు కమలాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు నూనె మల్లిఖార్జున యాదవ్, దాసరి రాజేష్, మల్లెబోయిన వెంకటేశ్వర్లుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సిటీలో విస్తరిస్తున్న కొబెల్కో

శ్రీసిటీలో జపాన్ దేశానికి చెందిన హైడ్రాలిక్ ఎక్స్కవేటర్లు ఉత్పత్తి పరిశ్రమ కొబెల్కొ కన్స్ట్రక్షన్ ఎక్విప్మెంట్ లిమిటెడ్ (కెసిఈపి) యూనిట్ విస్తరణకు ఈ నెల 20వ తేదీ భూమిపూజ జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొనగా, కొబెల్కొ కన్స్ట్రక్షన్ మెషినరీ(కెసిఎం) డైరెక్టర్ మరియు మేనేజింగ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అకిరా కినోషిత, షిముజు కార్పొరేషన్ డిప్యూటీ డైరెక్టర్ టిట్సు యమమురా తదితరులు పాల్గొని జపాన్ సంప్రదాయబద్దంగా భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్ర సన్నారెడ్డి కొబెల్కొ యాజమాన్యా నికి అభినందనలు తెలుపుతూ, జపాన్ దేశానికి సంబంధించి, కొబెల్కొ సంస్థ శ్రీసిటీకి మొదటి కస్టమర్ అని, ఈ సంస్థ వరుసగా మూడుసార్లు యూనిట్ విస్తరణతో అభివృద్ధి




భూమిపూజలో పాల్గొన్న శ్రీసిటీ ఎండీ, కొబెల్కొ ప్రతినిధులు

దిశలో పయనం సాగించడంపట్ల సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టితో ఈ ప్రాంతాన్ని ఆటోమొబైల్ క్లస్టర్‌గా అభివృద్ధి చేస్తున్న నేపథ్యంలో అదే రంగానికి చెందిన కొబెల్కొ గ్రూప్ తన వ్యాపారాన్ని విస్తరిస్తూపోవడం ద్వారా శ్రీసిటీ ఈ తరహా పరిశ్రమలకు అనువైన ప్రాంతంగా గుర్తింపు దక్కించుకొందన్నారు.

అకిరా కినోషిత మాట్లాడుతూ, ప్రస్తుతం 2వేల హైడ్రాలిక్ ఎక్స్కవేటర్లు ఉత్పత్తి చేస్తుండగా, విస్తరణ యూనిట్ ద్వారా మరో 50 శాతం ఉత్పత్తి పెంపు ఉంటుందని తెలిపారు. టిట్సు యమమురా మాట్లాడుతూ, షిముజు కార్పొరేషన్ మరియు కొబెల్కొ ఇండియా గ్రూప్‌కు మంచి అవినాభావ సంబంధం ఉందని, తద్వారా నిర్ణీత సమయం కన్నా ముందే ప్లాంట్ నిర్మాణం పూర్తిచేస్తామన్నారు.

10 ఏండ్ల క్రితం ఇండియాలో తమ బిజినెస్ ప్రారంభమైందని, జనవరి 2011లో శ్రీసిటీలో ప్లాంట్ నిర్మించి, పలు వినూత్న ఆవిష్కరణలతో కస్టమర్లకు అనువైన వివిధ మోడల్స్ హైడ్రాలిక్ ఎక్స్కవేటర్‌లు ఉత్పత్తి చేస్తున్నట్లు కెసిఈపి మేనేజింగ్ డైరెక్టర్ యుటకు గోటా తెలిపారు. తమ వ్యాపారం 10రెట్లు పెరిగిందని, ఈ నేపథ్యంలోనే పలు యూనిట్ల విస్తరణ చేపడుతున్నామన్నారు.

# పెద్దల మధ్య ఉగాది వేడుక



అన్నదానం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఈ నెల 18న ఉగాది వేడుకలను తనకు ఎంతో ఇష్టమైన పొదలకూరురోడ్డులోని పెద్దలకొలువు వద్ద జరుపుకున్నారు. నెల్లూరు ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి కూడా ఈ వేడుకలకు విచ్చేసి పెద్దలతో ముచ్చట్లు పెట్టుకున్నారు. సీనియర్ సిటిజన్స్, రిటైర్డ్ ఉద్యోగులకు ఒక మంచి విశ్రాంతి భవనాన్ని కట్టించారంటూ ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిని ఎంపి అభినందించారు. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ పెద్దలకొలువు ఎందరో విశ్రాంత మేధావులు, అనుభవజ్ఞుల వేదికగా మారిందని, వారి సూచనలు, సలహాలు తన రాజకీయ పయనానికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. పెద్దల సేవ చేసుకునే అవకాశం రావడం తన అదృష్టంగా చెప్పుకున్నారాయన! ఈ సందర్భంగా పెద్దల కొలువులో ఎల్ఇడి టి.విని అందించిన ఓవెల్ స్కూల్ అధినేత వేణుగోపాల్‌ను ఎం.పి, ఎమ్మెల్యే సత్కరించారు.

ఈ కార్యక్రమంలో రామకృష్ణారెడ్డి, మస్తాన్‌రెడ్డి, ఆదికేశవులు, పెంచలయ్య, ఇంద్రసేన, లక్ష్మీరెడ్డి, రమణయ్య, ప్రసాద్‌రెడ్డి, మస్తానయ్య, నరసయ్య, పీరాం, సత్యనారాయణ, మధుసూధనరావు, నవాజ్ షరీఫ్, తాటి వెంకటేశ్వరరావు, బొబ్బల శ్రీనివాస యాదవ్, మొయిళ్ళ గౌరి, తోట శోభారాణి, చెక్కా సాయి సునీల్, మురళీకృష్ణ యాదవ్, మేఘనాధ్‌సింగ్, డా॥ సత్తార్, హజరత్‌నాయుడు, చిన్న మస్తాన్, పర్వతాల శ్రీనివాసులు, మొయిళ్ళ సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



### అనిల్ సమక్షంలో...

## వైసిపిలో చేరిన కపాడిపాలెం యువకులు

నెల్లూరు నగరం 51వ డివిజన్‌లోని కపాడిపాలెంకు చెందిన 100మంది యువకులు ఈ నెల 18న నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ సమక్షంలో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరారు. రాజన్నభవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో వాకాటి ఒలీవా, దానం శ్రీకాంత్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన యువకులకు అనిల్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో యువతకు భవిత, భద్రత కల్పించేది జగనన్నేనన్నారు. 2019లో వైసిపి అధికారంలోకి వస్తే యువతకు బంగారు భవిష్యత్ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెంకి, ఉదయ్, ఎబిన్, వంశీ, భరత్, యశ్వంత్, హర్ష, విజయ్, కాయల సురేష్‌బాబు, నాగూరు నాగార్జునరెడ్డి, జి.పి.శ్రావణ్‌కుమార్, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

## జడ్పీ వాకర్స్ ఉగాది సంబరాలు



శ్రీ విళంబి నామ సంవత్సర ఉగాది సందర్భంగా ఈ నెల 18న నెల్లూరు పొదలకూరు రోడ్డులోని జడ్పీ పాఠశాలలో జడ్పీ వాకర్స్ అసోసియేషన్ వారు ఉత్సాహభరితంగా ఉగాది పండుగ సంబరాలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా బిరుదవోలు రామిరెడ్డి ఉగాది కవితను చదివి సభ్యులందరిని ఉత్సాహపరిచారు. అధ్యక్షులు చలంచర్ల భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి జెయస్‌ఆర్ ఆంజనేయులు, మండవ శ్రీనివాసరావులు ఉగాది సందేశాన్ని అందించారు. బి.రాజగోపాల్, బిఆర్ శ్రీధర్ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి, పులిహోర, వడ సభ్యులకు పంపిణీ చేశారు. అనంతరం జడ్పీ వాకర్స్ నిర్వహణలో బాలికల వసతి గృహంలోని విద్యార్థులందరికి ఉగాది పచ్చడి తినిపించి, పెన్నులు, పెన్సిళ్ళను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పి.సింధు, యు.చెంచయ్య, వై.దయాకర్‌రెడ్డి పాల్గొని విద్యార్థులకు సందేశం ఇచ్చి ఉత్సాహపరిచారు.

## నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం ఏర్పాటు




రాష్ట్ర నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం నెల్లూరుజిల్లా శాఖ ఈనెల 19న ఏర్పాటైంది. నెల్లూరులోని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాతూరి అన్నపూర్ణ ఆధ్వర్యంలో డాక్టర్ జయప్రద ఆసుపత్రిలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు రచయిత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాతూరి అన్నపూర్ణ మాట్లాడుతూ, సమాజాన్ని చైతన్య వంతం చేసేందుకు, యువతను సాహిత్యం వైపు మళ్ళించేందుకు తమ సంఘం కృషి చేస్తోందన్నారు. అనంతరం, నవ్యాంధ్ర రచయిత్రుల జిల్లా సంఘం ఏర్పాటు చేసుకున్నారు. గౌరవాధ్యక్షులుగా డాక్టర్ పెళ్ళకూరు జయప్రద, గోవిందరాజుల సుభద్రాదేవి, అధ్యక్షురాలిగా తోట సులోచన ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షురాలిగా ఎస్.జానకి, ఎం.విజయదుర్గ, కార్యదర్శిగా లక్ష్మీభవాని, కోశాధికారిగా దువ్వూరు సుమలతతో పాటు, అనూరాధా రామకృష్ణ, లలితా ప్రవల్లిక సభ్యులుగా ఎన్నికయ్యారు.

# చదువుతో పాటు క్రీడలూ ముఖ్యమే!

### - చైర్‌పర్సన్ దేవసేన

విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో అంతే ప్రాధాన్యతను క్రీడలపై చూపితే ప్రత్యేకగుర్తింపు సాధించవచ్చని గూడూరు పురపాలక చైర్‌పర్సన్ పొనకా దేవసేన తెలిపారు. గూడూరు పట్టణంలోని వై.ఎస్.ఆర్ పార్కులో ఆదివారం కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌ను శిక్షకుడు హరిబాబు నిర్వహించారు. పోటీల్లో వివిధ విభాగాల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతి, ప్రశంసాపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కల్పన, ప్రతినిధులు శ్రీధర్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.




విజేతలకు బహుమతులందజేస్తున్న చైర్‌పర్సన్ పొనకా దేవసేన

## గూడూరు డివిజన్ వార్తలు

## వైకాపా మానవహారం



గూడూరు పట్టణంలోని గడియారపు స్థంభం కూడలి వద్ద వైకాపా నాయకుల ఆధ్వర్యంలో అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా మానవహారాన్ని ఈ నెల 19వ తేదీ నిర్వహించారు. పట్టణంలోని రోడ్లు భవనాల అతిథి గృహం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు భారీ ర్యాలీగా వెళ్లి గడియారపు స్థంభం వద్ద మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు మేరిగ మురళి, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, పద్మనాభరెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, కోడూరు మీరారెడ్డి, మల్లు విజయకుమార్‌రెడ్డి, నాశిన నాగులు, గిరిబాబు, పెంచలరెడ్డి, తాళ్ళూరు శ్రీనివాసులు, ఎస్.శ్రీనివాసులురెడ్డి, రంజిన్‌రెడ్డి, మగ్దూం, దాసరి వెంకటేశ్వర్లు, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సురేంద్రరెడ్డికి రోటరీ ప్రతిష్టాత్మక సేవా అవార్డ్



రోటరీ ఇంటర్నేషనల్ ప్రతినిధి ఆల్‌బర్గ్ నుండి అవార్డునందుకుంటున్న సురేంద్రరెడ్డి



సురేంద్రరెడ్డిని అభినందిస్తున్న రోటరీ ప్రతినిధులు

గూడూరు రోటరీ క్లబ్ ద్వారా అత్యున్నత సేవలు చేసినందుకు రోటరీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అత్యున్నత పురస్కారం రోటరీ పిడిజి బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి అందుకోవడం సంతోషంగా ఉందని రోటరీ క్లబ్ అధ్యక్షుడు కె.మునిరాజా, కార్యదర్శి బాలకృష్ణం రాజు తెలిపారు. గూడూరు పట్టణంలోని సురేంద్రరెడ్డి నివాసంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పేరు ప్రఖ్యాతులున్న రోటరీ ఇంటర్నేషనల్, రోటరీ ఫౌండేషన్ అత్యున్నత రోటరీ డిస్టింగ్‌విష్ట్ సర్వీసెస్ అవార్డు అందించడం అభినందనీయమన్నారు. రోటరీ క్లబ్‌లో అతిచిన్న వయస్సులోనే రోటరీ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన సురేంద్రరెడ్డి భవిష్యత్‌లో రోటరీ ఇంటర్నేషనల్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టాలని కోరుతున్నట్లు చెప్పారు. గూడూరు వాసి అయిన సురేంద్రరెడ్డికి అవార్డు రావడం గూడూరు రోటరీక్లబ్‌కు గర్వకారణం అన్నారు. అవార్డుగ్రహీత సురేంద్రరెడ్డి మాట్లాడుతూ రోటరీ ఇంటర్నేషనల్ ప్రతినిధి ఆల్‌బర్గ్ చేతులమీదుగా అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. అవార్డును తన తండ్రికి అంకితం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు కె.మునిగిరీష్, దశరథరామిరెడ్డి, బి.శ్రీకాంత్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, రాము, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ డెంటల్ క్యాంప్



గూడూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నెల్లటూరు ఎలిమెంటరీ స్కూల్ నందు నారాయణ డెంటల్ హాస్పిటల్ వారు డాక్టర్ నారాయణ దాతృత్వంతో విద్యార్థులకు ఇటీవల డెంటల్ క్యాంపు ఏర్పాటు చేసి ఉచితంగా మందులు, పేస్టు, బ్రెష్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు నెలబల్లి భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి జి.చంద్రశేఖర్, ట్రెజరర్ కడివేటి చంద్రశేఖర్, డాక్టర్ నారాయణ, సిబ్బంది, హెడ్‌మాస్టర్ భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## నేత్రపర్వంగా శివపార్వతుల కళ్యాణం



గూడూరు పట్టణంలోని శివాలయంలో ఇటీవల శివపార్వతులకు కళ్యాణాన్ని వేదపండితుల వేదమంత్రోచ్ఛారణలతో వైభవంగా నిర్వహించారు. ఆలయ ఛైర్మెన్ నాగసూరి లక్ష్మి, నాగసూరి గోపాలరావు, మైథిలి హాస్పిటల్ ఎం.డి రమణబాబు, ఆయన సతీమణి డాక్టర్ మైథిలి, పూజారి రత్నయ్య పాల్గొన్నారు.

శ్రీను గల్పిక

# బాబుకు సారీ చెప్పిన పవన్

ఉండవల్లిలోని హైటెక్‌రత్న, ఆంధ్రా సీఎం చంద్రబాబునాయుడు క్యాంపు కార్యాలయం. నారా లోకేష్ ఒక పుస్తకం పట్టుకుని అటు ఇటు తిరుగుతూ... "దివంగతులైన వారి పుట్టినరోజును జయంతి అనియు, మరణించిన రోజును వర్ధంతి అనియు" అందరు... అని పదే పదే చదువుతున్నారు. లోకేష్‌ను చంద్రబాబు కుర్చీలో కూర్చుని బెత్తం పట్టుకుని చదివిస్తున్నాడు. అప్పుడే ఎక్సైజ్ మంత్రి జవహర్‌బాబు లోపలకు వచ్చాడు. సార్, అబ్బాయి చదివి చదివి అలసిపోయినట్లున్నాడు. హెల్త్ డ్రింక్స్(బీరు) ఏమన్నా తెప్పించమంటారా? అని అడిగాడు. నీ డ్రింక్స్ ఏమీ అవసరం లేదు, గంటకోసారి వాళ్ళమ్మ బూస్ట్ అందిస్తుందిలే అని చంద్రబాబు చెప్పాడు. మళ్ళీ జవహర్ వుండి... లోకేష్‌బాబు... చదువుకునే రోజుల్లోనే ఇంత శ్రద్ధగా చదువుంటే ఏ ఐఏఎస్సో, ఐపిఎస్సో అయ్యుండేవాడయ్యా అని అన్నాడు. చంద్రబాబుకు ఆ మాటతో తిక్కరేగింది. చదువుకుని వుంటే ఐఏఎస్ అయ్యేవాడు, శ్రద్ధగా చదువుకోకపోబట్టి ఐఏఎస్‌లకు బాస్ అయ్యాడు... అని చెప్పాడు. వెంటనే జవహర్... దీన్నిబట్టి చదువుకోకపోవడమే మేలంటారా... మరి రాష్ట్రంలో ఇన్ని స్కూళ్లెందుకు, చదువుకోండని చెప్పి స్కాలర్‌షిప్ లెందుకు. మంచి ఫలితాలు రావాలంటూ అయ్యవార్ల మీద ఒత్తిళ్లెందుకు. చదువుకోకుంటే అందరూ మన లోకేష్‌బాబులాగా అభివృద్ధి చెందుతారు కదా అని చెప్పాడు. చంద్రబాబుకు కోపం అరికాల్లో కొచ్చింది. తమాయించుకుని నీతో ఈ సబ్జెక్ట్‌పై మళ్ళీ తాపీగా డిస్కషన్ చేస్తాను, ముందు నువ్వు వెళ్ళు అని చెప్పాడు. మీరు ఏదో ఫ్రెస్టేషన్‌లో ఉన్నట్లున్నారు, మీకు కూడా రెండు హెల్త్ డ్రింక్స్ పంపించమంటారా? రిలాక్స్ అవుదురు అని జవహర్‌బాబు అడిగాడు. చంద్రబాబు రెండు చేతులు జోడించి మీతో మళ్ళీ మాట్లాడుతానని పంపించేసాడు. అప్పుడే మంత్రులు పి.నారాయణ, పత్తిపాటి పుల్లారావు, దేవినేని ఉమామహేశ్వరరావులు వచ్చారు. వాళ్ళ ముఖాలు కృష్ణపట్నం థర్మల్ విద్యుత్ కేంద్రాల్లాగా వెలిగిపోతున్నాయి. ఏంటి విషయం అని చంద్రబాబు అడిగాడు. దానికి నారాయణ... ప్రత్యేకహోదా ఉద్యమం విషయంలో మీరు పడుతున్న బాధ చూడలేకేమో, మన పవన్ కళ్యాణ్ గుంటూరులో మీటింగ్ పెట్టాడు. జగన్ ప్రత్యేకహోదా ఉద్యమాన్ని డైవర్ట్ చేస్తాడు. జగన్ అవినీతి మీద విమర్శలు చేస్తాడు. దాంతో వైకాపా వాళ్ళు హోదా ఉద్యమాన్ని వదిలేసి పవన్‌ను తిట్టడానికి మళ్ళుకుంటారు. మీకు ఏ సమస్యా వుండదు అని చెప్పాడు. చంద్రబాబు వెంటనే డిజిపి ఆఫీసుకు ఫోన్ చేసాడు. పవన్ కళ్యాణ్ మీటింగ్‌కు వెంటనే పర్మిషన్ ఇవ్వాలని ఆదేశించాడు. తర్వాత మంత్రులు ముగ్గురితో... పవన్ సభకు ఏర్పాట్లు చూడండి... స్టేజీ గట్టిగా వుండాలి. పవన్ మంగళగిరిలో మాట్లాడితే వెంకటగిరిలో వినిపించేలా మైక్‌సెట్లు ఏర్పాటు చేయండి, అన్ని జిల్లాల నుండి కార్యకర్తలు రావడానికి బస్సులు, కార్లు ఏర్పాటు చేయండి, జనం తగ్గే పరిస్థితి వుంటే మన కార్యకర్తలను కూడా తరలించండి, జన సమీకరణకు అవసరమైతే ఎంతైనా ఖర్చు చేయండి, మందు, బిర్యాని సప్లయ్ చేయండి... ఈ మీటింగ్‌తో జగన్‌కు దిమ్మ తిరగాలి... మన 'చంద్రజ్యోతి', 'ఈరోజు' టీవీ 9-9=99, ఏసిడిటి, నంగి టీవీ, టీవీ 2.5లకు కూడా సమాచారమివ్వండి... అన్ని టీవీలలో పవన్ సభ ప్రత్యక్ష ప్రసారం కావాలి. పత్రికలలో పవన్‌దే బ్యానర్ ఐటమ్‌గా రావాలి. పవన్ మనోడే అంతా మంచిగా జరిగిపోవాలి అని చెప్పాడు. అలాగే చేస్తాం సార్ అంటూ నారాయణ, పత్తిపాటి, ఉమలు అక్కడ నుండి లేచారు.

★★★★★

మంగళగిరిలోని కాజా వద్ద జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభ. పవన్ వేదికెక్కాడు. అభిమానులు కేరింతలు కొట్టారు. టీవీలన్నీ ఆ సభను ప్రత్యక్షప్రసారం చేయసాగాయి. పవన్‌కళ్యాణ్ చొక్కా జేబులో నుండి ఓ పేపర్ తీసి అప్పుడప్పుడు చూసుకుంటూ ఆవేశంతో మాట్లాడసాగాడు. తెలుగుదేశం ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయింది. 2019 ఎలక్షన్‌లలో జగన్‌ను ఓడించడానికి నియోజకవర్గానికి పాతిక కోట్లు లెక్కన ఖర్చు పెడతారట. ఇన్ని కోట్లు వీళ్ళకు ఎక్కడనుండి వచ్చాయి. ఇది అవినీతి సొమ్ము కాదా? లోకేష్ అవినీతి చంద్రబాబుకు కనపడడం లేదా?... అంటూ చంద్రబాబు మీద, ఆయన కొడుకు లోకేష్ మీద తీవ్ర విమర్శలు చేసాడు. చంద్రబాబు అనుకూల ఛానెల్స్ అన్నీ కూడా ఇది ఆయన కాన్సెప్ట్‌లో భాగమేననుకుని మక్కీకి మక్కీ లైవ్ ఇచ్చాయి. టీవీలలో పవన్ ప్రసంగం చూసి చంద్రబాబు షాక్ తిన్నాడు. ఈ పవన్‌కు ఏమైంది... ఎందుకిలా జరిగింది... ఎందుకు అతను అడ్డం తిరిగాడు... ఇదే ఆలోచనతో ఆందోళన చెందసాగాడు.

★★★★★

సభ ముగించుకుని పవన్ తన ఇంటికి వచ్చాడు. అప్పుడే ఫోన్ రింగయ్యింది. ఆన్ చేసాడు. అవతల నుండి చంద్రబాబు... ఏం పవన్ నీకు ఏం తక్కువ చేసామని మా మీద విరుచుకుపడ్డావ్, నువ్వు అడిగినట్లే అన్నీ చేస్తున్నాం కదా, మరి మామీద ఎందుకు అన్ని విమర్శలు చేసావ్ అని నిష్టూరంగా అడిగాడు. దానికి పవన్... అదేంటి సార్, మీరు పంపించిన స్క్రిప్టే కదా నేను చదివింది అని అన్నాడు. ఆ మాటకు బాబుకు మైండ్ బ్లాక్ అయ్యింది. నేను ఆ స్క్రిప్ట్ పంపడమేంటి.. జగన్‌ను తిడుతూ వ్రాసిన స్క్రిప్ట్ కదా నీకు పంపించింది అని చంద్రబాబు అన్నాడు. అప్పుడు పవన్ ఆలోచనలో పడ్డాడు. సినిమా స్టైల్‌లో రివర్స్ లోకి వెళ్ళాడు.

★★★★★

ప్రత్యేకహోదాపై పవన్ ఏర్పాటు చేసిన జెఎఫ్‌సి సమావేశానికి ఉండవల్లి అరుణ్‌కుమార్, జయప్రకాశ్‌నారాయణ, చలసాని శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు. మీటింగ్ అయ్యాక అందరూ హడావిడిగా లేచారు. ఆ లేవడంలో ఉండవల్లి, పవన్‌లు ఒకరికొకకరు గుద్దుకుని వారి చేతుల్లోని ఫైళ్ళు ఎదురెదురుగా కిందపడ్డాయి. అలా ఇద్దరూ వంగి తీసుకోవడంలో ఉండవల్లి ఫైల్ పవన్ చేతిలోకి, పవన్ ఫైల్ ఉండవల్లి చేతిలోకి వచ్చింది. చంద్రబాబును తిట్టడానికి ఉండవల్లి వ్రాసుకున్న స్క్రిప్ట్ అలా పవన్ చేతుల్లోకి వెళ్ళి గుంటూరు సభలో తూటాలా పేలింది.

★★★★★

ఫ్లాష్‌బ్యాక్‌లో విషయం అర్థం కావడంతో పవన్ నాలుక్కరుచుకుని... పొరపాటు జరిగింది చంద్రబాబు గారు, పొరపాటున ఉండవల్లి స్క్రిప్ట్‌ను చదివేసాను, ఈసారి అలా జరగనివ్వనులే అని అన్నాడు. ఇక జరిగేదేముంది... జరగాల్సింది జరిగిపోయింది. ఉండవల్లి నీ పక్కన చేరినప్పుడే అనుకున్నాలే... ఇలాంటిదేదో వుంటుందంటూ చంద్రబాబు విసురుగా ఫోన్ కట్ చేసాడు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఇతరుల నుండి అనుకున్న సహాయాన్ని పొందలేకపోవచ్చును. దూర ప్రయాణాలు వాయిదా పడటం, శుభకార్య ప్రయత్నాలకు ఆటంకాలుండటం జరుగుతుంది. చిన్న వ్యాపారాలకు ఆదాయం ఫరవాలేదు. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. విద్యార్థులు బాగా కష్టపడి చదవ వలసి వుంటుంది. వృత్తి వ్యాపారాలు సంతృప్తికరంగా ఉండవు. ఖర్చులు పెరుగుతాయి.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

గృహ నిర్మాణదారులకు, కాంట్రాక్టర్లకు బాగుంటుంది. భూ లావాదేవీలు ఫలించగలవు. సభలు సమావేశాలలో గుర్తింపు గౌరవం బాగుంటుంది. కోర్టు కేసులందు అనుకూలత, విద్యార్థులకు మంచి ప్రగతి, జాతకులకు ఆరోగ్యం బాగుంటుంది. వృత్తి పరంగా జీవనం కలవారికి ఆర్థికస్థితి కొంత బాగుంటుంది. వ్యాపార వర్గాలకు మంచి అభివృద్ధి ఆదాయముంటుంది.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

వ్యవహారాలలో సరైన నిర్ణయాలు తీసికొంటారు. ఉద్యోగార్థులకు మేలైన అవకాశాలుండకపోవచ్చును. కుటుంబసౌఖ్యం బంధు సఖ్యత బాగుంటుంది. విద్యా ప్రగతి బాగుంటుంది. కొత్త పెట్టుబడులు, వ్యాపార భాగస్వామ్యాలకు అవకాశాలు లభించగలవు. అవసరాలకు మాట రూపేణ, డబ్బు రూపేణ సహాయం చేస్తారు. ఆరోగ్యం జాగ్రత్త. అనుకోని ప్రయాణాలుంటాయి.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఉద్యోగులకు రావలసిన బాకీలు లభించడం, పని భారం ఉంటుంది. తొందరపాటు నిర్ణయాలు జరపకుండా జాగ్రత్తపడాలి. బిడ్డల విద్యా శుభకార్య విషయాలందు శ్రద్ధ చూపుతారు. ఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకొనండి. రావలసిన బాకీలు కొంత అందుతాయి. ఆర్థికంగా బాగుండి, వృత్తి వ్యాపారాలలో శ్రమకు తగ్గ ఫలితం ఉంటుంది. అనుకున్న పనులు నిదానంగా జరుగుతాయి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

పారిశ్రామికవేత్తలకు, కాంట్రాక్టర్లకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. బంధుమిత్రులకు సహాయపడతారు. ప్రముఖులతో పరిచయాలుంటాయి. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. ఆరోగ్యం ఫరవాలేదు. విద్యావృద్ధి కలదు. ఆదాయం పెరిగి వృత్తి వ్యాపారాలు సంతృప్తికరంగా సాగుతాయి. అయితే ఖర్చులు కూడా పెరుగుతాయి. బ్యాంకు ఋణాలు లభించగలవు.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

కోర్టు వ్యవహారాలలో అనుకూలత తక్కువ. పట్టుదలతో అనుకున్న పనులు సాధించుకొంటారు. అనుకోని ఖర్చులు పైనబడగలవు. ప్రముఖులతో పరిచయాలు బలపడతాయి. విద్యాప్రగతి బాగుంటుంది. ఆరోగ్యం ఫరవాలేదు. స్థిరాస్తుల లావాదేవీలు, కొత్త పెట్టుబడులు జరుపుతారు. చిన్న వ్యాపారాలు, వృత్తి జీవనం కలవారికి ఆర్థికంగా బాగుంటుంది.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 23.3.2018 నుండి
తేది. 29.3.2018 వరకు

ఈ వారం మీనంలో రవి బుధ శుక్రులు, 26తేది నుండి మేషంలో శుక్రుడు, వృషభ మిధున కర్కాటక సింహ రాశులలో చంద్రుడు, కర్కాటకంలో రాహువు, తులలో వక్రగురువు, ధనుస్సులో శనికుజులు, మకరంలో కేతువు సంచరిస్తారు.

పంచాంగము
తేది 23 శుక్రవారం ఉదయం గంట 7.20 నుండి 9.0 లోగా
మేష లగ్నమున గృహారంభ, వ్యాపారాలు ముహూర్తము.
తేది 25 ఆదివారం శ్రీరామనవమి.

### చైత్ర మాస శుక్లపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 23 | శుక్ర | షష్ఠి | ప॥ గం.12.08వ॥ |
| తేది. 24 | శని | సప్తమి | ఉ॥ గం.9.58వ॥ |
| తేది. 25 | ఆది | అష్టమి | ఉ॥ గం.7.37వ॥ |
| | పిదప | నవమి | రా॥ గం.5.11వ॥ |
| తేది. 26 | సోమ | దశమి | రా॥ గం.2.47వ॥ |
| తేది. 27 | మంగళ | ఏకాదశి | రా॥ గం. 12.30వ॥ |
| తేది. 28 | బుధ | ద్వాదశి | రా॥ గం.10.20వ॥ |
| తేది. 29 | గురు | త్రయోదశి | రా॥ గం.8.27వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఇతరులపై ఆధారపడకుండా నిర్ణయాలు తీసికొనండి. గృహ వస్తు వాహన రిపేర్లు ఏర్పడతాయి. ఉద్యోగ ప్రయత్నాలు చేసేవారికి అనుకూల సమయం. ఉద్యోగులకు విధి నిర్వహణ బాగుంటుంది. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. కొన్ని ముఖ్య పనులు వాయిదా వేసుకొంటారు. వృత్తి వ్యాపారాలలో సామాన్య అవకాశాలు, ఆదాయం ఉంటుంది.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఉద్యోగ సౌఖ్యం, కొత్త ఉద్యోగావకాశాలు దొరకడం జరుగవచ్చును. కొత్త పరిచయాలు, దైవ కార్యాలలో పాల్గొనడం, దూరప్రయాణాలు వాయిదా పడటం జరుగుతుంది. పరుష ప్రవర్తన, తొందరపాటు మాటలు తగ్గించుకొనాలి. విద్యా ప్రగతి బాగుంటుంది. స్థిరాస్తుల లావాదేవీలు జరుపుతారు. సమస్యాత్మక విషయాలలో సంప్రదింపులు, చర్చలు జరిపి పరిష్కారం కాగలవు.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఉద్యోగులకు స్థాన మార్పులు, పని భారం బాగుంటుంది. యజమానులు వర్కర్లతో జాగ్రత్తగా మెలగండి. శరీరానికి గాయాలు తగలవచ్చును. కొంతమంది మిమ్మల్ని పరోక్షంగా కించపరచవచ్చును. విద్యా ప్రగతి బాగుంటుంది. వ్యాపారాలలో ఒడిదుడుకులను అధిగమించి, రాబడి పెరుగుతుంది. వృత్తి జీవనంలో సామాన్య అవకాశాలుంటాయి. బిడ్డలకు అభివృద్ధి బాగుంది.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

సమస్యలు సక్రమంగా సర్దుబాటు కాగలవు. పారిశ్రామిక వర్గాలకు ప్రోత్సాహం ఉంటుంది. శుభకార్య ప్రయత్నాలలో అనుకూలత కలదు. ఆస్థుల లావాదేవీలు వాయిదా పడతాయి. విద్యాప్రగతి, ఆరోగ్యం బాగుంటుంది. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా జరుగుతాయి. ఆశించినంత ఎక్కువ ఆదాయముండదు. బ్యాంకు ఋణాలు లభించడంలో కాలయాపన జరుగవచ్చును.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ఉద్యోగులు తమ విధి నిర్వహణ సమర్ధవంతంగా జరుపుతారు. ఉద్యోగ ప్రయత్నాలలో అవకాశాలు దొరుకుతాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. ఆర్థికంగా బాగుంటుంది. దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు. కుటుంబంలో చిన్న చిన్న సమస్యలుండి సర్దుబాటు కాగలవు. గృహ వస్తు వాహన రిపేర్లుంటాయి. వృత్తి వ్యాపారాలు అభివృద్ధికరంగా ఉంటాయి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

అనుకున్న పనులను జాగ్రత్తగా నెరవేర్చుకుంటారు. విద్యాప్రగతి బాగుంటుంది. ఆరోగ్యం ఫరవాలేదు. ఉమ్మడి వ్యాపారాలకు లీజులకు అవకాశాలు దొరుకుతాయి. కళాక్రీడా సాంకేతిక రంగాల వారికి ఆదరణ ఉంటుంది. బంధువర్గాన్ని కలుసుకొంటారు. ప్రయాణాలుంటాయి. పైకి తీవ్రత లేకపోయినా ఆర్థికంగా ఇబ్బందులుంటాయి. ఉద్యోగార్థులకు అవకాశాలు లభిస్తాయి.

# హోదా పోరులో రాజీ లేదు

## ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర

టిడిపికి రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని, ప్రత్యేకహోదా విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని టిడిపి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర అన్నారు. ఈ నెల 17న నెల్లూరులోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యకహోదా ఇవ్వడం సాధ్యపడదని, అయితే ప్యాకేజీ ద్వారా అంతకంటే ఎక్కువ ప్రయోజనాలు కల్పిస్తామని కేంద్రం చెప్పడంతో రాష్ట్రప్రభుత్వం అంగీకరించిందని, ఆ తర్వాత హామీలు అమలుచేయడంలో ఎన్డీఏ ప్రభుత్వం నాన్చుడు ధోరణి అవలంభిస్తుడడంతో టిడిపి ఆ పార్టీ నుంచి బయటకువచ్చి అవిశ్వాస తీర్మానం పెడుతోందన్నారు. ప్రజారాజ్యం పార్టీ భాగస్వామిగా ఉన్న కాంగ్రెస్ పార్టీ హయాంలోనే రాష్ట్రం అవినీతిలో ప్రధమస్థానంలో ఉన్న విషయాన్ని పవన్ తెలుసుకోవాలని ఆయన ఈ సందర్భంగా హితవు పలికారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇవ్వని కేంద్ర ఆర్ధికమంత్రి అరుణ్‌జైట్లీని ప్రశ్నించకుండా టిడిపిపై పవన్ ఆరోపణలు చేయడం తగదన్నారు. ఈ సమావేశంలో నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తాళ్ళపాక అనూరాధ, చాట్ల నరసింహారావు, మనోహర్‌రెడ్డి, బాలకృష్ణచౌదరి తదితరులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బీద రవిచంద్ర



ఇటీవల తండ్రిని కోల్పోయి విషాదంలో ఉన్న టివి9 జిల్లా స్టాఫ్ రిపోర్టర్ చెన్నూరు మురళీరెడ్డిని 22వ తేదీ డి.వి.సత్రం మండలం తనయాలిలోని ఆయన ఇంటికి వెళ్ళి పరామర్శిస్తున్న సర్వేపల్లి టిడిపి ఇన్‌ఛార్జ్ సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, పక్కన మాజీఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం

# త్యాగధనుడు.. శ్రీ పొట్టి శ్రీరాములు

అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు ఆదర్శప్రాయులని.. త్యాగధనుడని అంతర్జాతీయ వైశ్య సమాఖ్య ఉపాధ్యక్షులు కె.వి.చలమయ్య అన్నారు. ఈ నెల 16న శ్రీ పొట్టి శ్రీరాములు 117వ జయంతి సందర్భంగా నెల్లూరులోని శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహానికి సమాఖ్య ప్రతినిధులందరూ కలసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కెవి చలమయ్య మాట్లాడుతూ శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి, వర్ధంతి రోజులను ప్రభుత్వం సెలవు దినాలుగా ప్రకటించాలని, నవ్యాంధ్ర అసెంబ్లీ హాల్‌లో ఆ మహనీయుని విగ్రహం ఏర్పాటు చేయాలని, ఆ త్యాగధనునికి 'భారతరత్న' బిరుదు ప్రకటించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నగరకంటి రవి, ఎస్.నాగేశ్వరరావు, కొండా ప్రేమశంకర్, ఆర్‌కెటి శేషయ్య, కొణతాలపల్లి నరసింహులు, ఆర్‌వి శరత్ తదితరులు పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములుకి నివాళులర్పిస్తున్న కె.వి.చలమయ్య

# పేద విద్యార్థినికి ఆర్థిక చేయూత



అమూల్యకు చెక్కును అందజేస్తున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు బద్దెపూడి రవీంద్ర, ట్రస్ట్ సభ్యులు

ముత్తుకూరుకు చెందిన దళిత విద్యార్థిని అమూల్యకు గరికపాటి ఓబయ్య, నరసమ్మ, రమణయ్య మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్ట్ తరపున ఎంసెట్ కోచింగ్ నిమిత్తం 15వేల రూపాయల నగదు సాయం అందించారు. ఇటీవల నెల్లూరు, వేదాయపాలెంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు బద్దెపూడి రవీంద్ర చేతులమీదుగా ట్రస్ట్ అధ్యక్షులు, రిటైర్డ్ ఇంజనీర్ గరికపాటి వెంకటకృష్ణయ్య అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మాల కొండయ్య, మంగళపురి వెంకటేశ్వర్లు, మాతంగి కృష్ణయ్య, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.


# ఉత్తరక్రియలు



మా తండ్రిగారైన

## శ్రీ చెన్నూరు మునిసుబ్బారెడ్డి గారు

తేది 10.03.2018 శనివారం స్వర్గస్తులైనారు.

వారి పవిత్రాత్మకు శాంతిని చేకూర్చమని భగవంతుని ప్రార్థిస్తూ...

కుమారుడు - కోడలు
**చెన్నూరు మురళీరెడ్డి - హేమ**
(టివి9 స్టాఫ్ రిపోర్టర్)

మనుమడు: **కుషాంత్ సాయిరెడ్డి**

భార్య: **సునీతమ్మ**

కూతురు - అల్లుడు
**భానుశ్రీ - పెల్లేటి ప్రసాద్‌రెడ్డి**

మనుమరాళ్ళు: **తనుశ్రీ, సింధుశ్రీ**

**ఉత్తరక్రియలు:** తేది.28.3.2018 బుధవారం ఉదయం 10గం.లకు దొరవారిసత్రం మండలం తనయాలి గ్రామంలోని మా స్వగృహమునందు జరుగును. కావున బంధుమిత్రులకు తెలియజేయడమైనది.


## కోటంరెడ్డి కోలుకోవాలని

# సర్వమత ప్రార్థనలు



కోటంరెడ్డి కోలుకోవాలంటూ పూజలు చేస్తున్న వైసిపి కార్యకర్తలు

నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అస్వస్థకు గురైన విషయం తెలుసుకున్న నెల్లూరు రూరల్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి త్వరగా కోలుకోవాలని అన్ని దేవాలయాలు, చర్చిలు, దర్గాలలో సర్వమత ప్రార్ధనలు చేశారు.

# నిత్యావసర సరుకులు పంపిణీ



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న సేవాసంస్థ సభ్యులు

నెల్లూరుజిల్లా కావలి పట్టణంలోని సంయుక్త సేవాసంస్థ ఆధ్వర్యంలో శాశ్వత దాతల సహకారంతో ఈ నెల 18న నిరుపేదలకు నిత్యావసర సరుకులు, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంయుక్త సేవాసంస్థ శాశ్వత దాతలు ఎస్.రమేష్, అయోధ్యకుమార్, శ్రీనివాసరావు, వి.నరసింహారావు, షేక్ అల్తాఫ్, లీలావతి, జాఫర్‌ఖాన్, ఎస్.సుధాకర్ నిత్యావసర సరుకులు ఏర్పాటు చేయగా, మాల్యాద్రి పది కుటుంబాలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా నిరుపేదలకు సాయం అందించడానికి ముందుకు వచ్చిన ప్రతిఒక్క దాతకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పఠాన్ ఖాదర్ భాష, వై.కిరణ్, శానం హరి, కృష్ణలు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో 'శ్రీ రామాయణ సప్తాహం'


కోట రాజశేఖర్ అవధానిని సత్కరిస్తున్న ఆలయ నిర్వాహకులు

తిరుమల తిరుపతి దేవస్థానం మరియు హిందూ ధర్మప్రచార పరిషత్ వారి సంయుక్త ఆధ్వర్యంలో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 19 నుంచి 25వ తేది వరకు నెల్లూరు వేదాయపాళెంలోని శ్రీకృష్ణ మందిరంలో 'శ్రీ రామాయణ సప్తాహం' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఎంతో భక్తిశ్రద్ధలతో జరుగుతున్న ఈ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 19, 20, 21 తేదీల్లో ప్రముఖ అవధాని కోట రాజశేఖర్ పాల్గొని శ్రీరామాయణం వైశిష్ట్యాన్ని భక్తజనులకు వివరించారు. టిటిడి ధర్మప్రచార పరిషత్ కో-ఆర్డినేటర్ మల్లెల శ్రీహరి పర్యవేక్షణలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో తొలిరోజు 'శ్రీరామనవమి ప్రాశస్త్యం', రెండవ రోజు 'శ్రీరాముడు ధర్మస్వరూపుడు' అనే అంశంపై ఆధ్యాత్మిక ఉపన్యాసం, మూడవరోజున 'సీతాదేవి చరిత్ర'ను అవధాని కోట రాజశేఖర్ ఎంతో సరళమైన రీతిలో వివరించి భక్తుల ప్రశంసలందుకున్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని రామాయణ కథను విన్నారు. అనంతరం, ఆలయ ప్రధాన కార్యదర్శి సుబ్బరామరాజు, వ్యవస్థాపక ధర్మకర్త వేంకటేశ్వర్లు, ఆలయ కార్యనిర్వాహకులు మాలకొండయ్య, కోశాధికారి శ్రీనివాసులు అవధాని కోట రాజశేఖర్‌ను ఘనంగా సత్కరించారు. కాగా, రామాయణ సప్తాహంలో భాగంగా ఈనెల 22, 23తేదీల్లో ప్రముఖ సాహితీవేత్త డా. చీమకుర్తి వేంకటేశ్వరరావు 'శ్రీమద్రామాయణము-సేవా ధర్మము' అనే అంశంపై ఉపన్యసిస్తారని, ఈ నెల 24, 25 తేదీల్లో ప్రముఖ కవి, సాహితీవేత్త బొగ్గవరపు రాధాకృష్ణమూర్తి పాల్గొని 'శ్రీమద్రామాయణము-జాతికి సందేశం' అనే అంశంపై ఆధ్యాత్మికోపన్యాసం చేస్తారని నిర్వాహకులు తెలియజేశారు.

# వేతనాలు బెత్తెడు... వెతలు బారెడు

## హోంగార్డుల అసోసియేషన్ ప్రతినిధుల ఆవేదన

రాష్ట్రవ్యాప్తంగా 15వేల మంది హోంగార్డులున్నారని, వారు రోజువారీ వేతనం కేవలం నాలుగువందల రూపాయలతోనే పనిచేస్తున్నారని, చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించుకోలేక, పిల్లల్ని చదవించుకోలేక, ఇళ్ళ అద్దెలు కట్టుకోలేక ఎన్నో ఆర్థిక ఇబ్బందులతో బాధలుపడుతున్నారని రాష్ట్ర హోంగార్డుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు బి.రామారావు యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వారి వేతనాలను పెంచాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ నెల 17న నెల్లూరులోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం హోంగార్డుల దినసరి వేతనాన్ని 400 నుంచి 675 రూపాయలకు పెంచడంతో పాటు, వారికి హెల్త్ కార్డులు, మెటర్నిటీ సెలవులు, ఇతర సౌకర్యాలు కల్పిస్తూ జిఓ విడుదల చేసిందని, ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మన రాష్ట్రంలో హోంగార్డుల వేతనాలు ఎంతో తక్కువగా ఉన్నాయని ఆయన వివరించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి హోంగార్డుల వేతనాలు పెంచి వారిని ఆదుకోవాలని, అదేవిధంగా హోంగార్డుల సమస్యలు పరిష్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హోంగార్డుల కార్యవర్గసభ్యులు డి.మురళి, ఎం.శ్రావణ్ కుమార్, సుధీర్‌కుమార్, సభ్యులు సుచరిత, దొరసానమ్మ, నాజిని పాల్గొన్నారు.

# 29న బడ్జెట్ సమావేశం

నెల్లూరు నగరపాలక సంస్థ బడ్జెట్ సమావేశం ఈ నెల 29న ఉదయం 11గంటలకు కౌన్సిల్‌హాల్‌లో నిర్వహించనున్నారు. ఈమేరకు అజెండా కాపీలను కూడా సభ్యులకు పంపించారు. గత ఏడాది 1084కోట్లతో బడ్జెట్ రూపొందించగా ఈ ఏడాది 1512కోట్లతో భారీ బడ్జెట్‌ను తయారు చేసారు. కార్పొరేషన్‌కు ఏడాదికి అన్ని పన్నుల రూపేణా వచ్చే ఆదాయం 133కోట్లే. వచ్చే ఆదాయం కన్నా 90శాతం అధికంగా బడ్జెట్‌ను రూపొందించారు. దీనిబట్టి చూస్తే మేయర్ అబ్దుల్ అజీజ్, చంద్రబాబును ఆదర్శంగా తీసుకున్నట్లు కనిపిస్తోంది. ఆయన కూడా అంతే రాష్ట్ర ఆదాయం తక్కువ. బడ్జెట్ ఆర్భాటం మాత్రం ఎక్కువ.

# హోదా హీరో ఎవరు?

(మొదటి పేజీ తరువాయి)

చంద్రబాబు స్వయంగా తన చేతులతోనే మట్టేసి ఆ గోతిని కప్పేసాడు. ప్రతిపక్ష నేత జగన్ మాత్రం ఆరోజు నుండి ప్రత్యేక హోదా... ప్రత్యేకహోదా... అని కలవరిస్తూనే వున్నాడు. కాకపోతే ఈమధ్య ఇంకాస్త స్వరం పెంచడంతో ఆ మాటలు మట్టి క్రింద కప్పేసి వున్న ప్రత్యేకహోదా చెవులను తాకాయి... ప్రత్యేకహోదా అంశం జగన్ పిలుపుతో మట్టిని చీల్చుకుంటూ పైకొచ్చి ఇప్పుడు రాష్ట్ర రాజకీయాలనే కాదు జాతీయ రాజకీయాలనూ షేక్ చేస్తోంది. ప్రత్యేకహోదాను వద్దన్న చంద్రబాబును కూడా షేకయ్యేలా చేసింది.

ఎవరెన్ని వేషాలేసినా, ఎన్ని విమర్శలు చేసినా ఈ రాష్ట్రంలో ప్రత్యేకహోదా ఉద్యమాన్ని సజీవంగా వుంచింది, దాని కోసం చిత్తశుద్ధిగా పోరాడింది జగన్మోహన్ రెడ్డే! కొందరు మేధావులు టీవీ చర్చా వేదికల్లో దీనిపై తమ వాదన వినిపిస్తున్నా రాజకీయంగా ఈ పోరాటాన్ని వేడెక్కించింది, ఈ సెగలు ఢిల్లీని తాకేలా చేసింది వైకాపా అధినేతే!

ప్రత్యేకహోదా ఇచ్చేది లేదని కేంద్రం ప్రకటిస్తే దానికి వంతపాడింది తెలుగుదేశం నాయకులే! ప్రత్యేకహోదా ఏమన్నా సంజీవనియా అని చంద్రబాబు అంటే, హోదా ఉద్యమాన్ని పందులాటతో పోల్చి మొన్నటివరకు కేంద్రమంత్రిగా వున్న ఆ పార్టీ నాయకుడు సుజనాచౌదరి తన చపలత్వాన్ని చాటుకున్నాడు. హోదాతో ఉద్యోగాలు వస్తున్నాయని ప్రచారం చేస్తూ జగన్ ప్రజలను మోసం చేస్తున్నాడంటూ సీఎం పుత్రరత్నం లోకేష్ ప్రవచించాడు. ప్రత్యేకహోదా విషయంలో కేంద్రం కంటే కూడా రాష్ట్ర ప్రజలను వంచనకు గురిచేసింది తెలుగుదేశం ప్రభుత్వమే!

కాని ఏరోజూ జగన్ ప్రత్యేకహోదా ఉద్యమం కాడెను కిందకు దించలేదు. ఏదో ఒక రూపంలో ఈ ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాడు. హోదా అంటే జైలుకే అని ప్రభుత్వం బెదిరిస్తున్నా ఆయన బెదరలేదు. దీక్షల నుండి కేంద్రంపై అవిశ్వాసతీర్మానం మొదలుకొని తన పార్టీ ఎంపీల రాజీనామా దాకా ఒక నిర్మాణాత్మక మార్గంలో ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్ళాడు. ఈ విషంలో జగన్ ఎక్కడా మాట మార్చలేదు, మార్గం తప్పలేదు, మడమ తిప్పలేదు.

ప్రత్యేకహోదా అంశంలో ఎన్నో మాటలు మార్చింది, ఎన్నో మలుపులు తిరిగింది చంద్రబాబునాయుడే! ప్రత్యేక హోదా ఉద్యమంతో రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. ప్రజల్లో జగన్ పట్ల సానుకూలత పెరిగింది. ప్రత్యేకహోదా ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన పెరిగింది. ప్రత్యేకహోదా పట్ల తన వైఖరి మార్చుకోకుంటే వచ్చే ఎన్నికల్లో చేదు ఫలితాలు తప్పవని గ్రహించాడు. అందుకే యూటర్న్ తీసుకున్నాడు. ప్రత్యేకహోదా అంశంపై వైసిపి ప్రవేశపెట్టే తీర్మానానికి మొదట మద్దతు ఇస్తామన్నాడు, కొన్ని గంటల్లోపే మాట మార్చాడు. వైసిపి అవిశ్వాసానికి మద్దతునిస్తే తాను వీక్ అవుతాననుకున్నాడో ఏమో వెంటనే నాలుక మడత పెట్టాడు. ఎన్డీఏ నుండి బయటకొచ్చి తమ పార్టీ తరపునే అవిశ్వాస తీర్మానం పెడుతున్నట్లు ప్రకటించాడు.

ఒక అంశంపై ఒక నాయకుడు ఇన్ని పిల్లిమొగ్గలు వేస్తాడా అన్నది చంద్రబాబు విషయంలోనే చూసాం. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ కూడా ప్రత్యేకహోదా విషయంలో పార్ట్‌టైం పోరాటం చేసాడే గాని, దీనిపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టింది లేదు. ప్రత్యేకహోదాపై మొదటనుండి ఒకే మాట మీద నిలబడింది, తన పోరాటంతో అందరినీ ఒకే బాటలోకి తెచ్చింది జగనే! ఎన్నికలకు ముందు ఇటలీ నియంత సోనియాను ఢీకొని ఔరా తెలుగు బిడ్డ... అనిపించుకున్నాడు. ఇప్పుడు ఇండియా నియంత మోడీని ఢీకొని తెలుగోడి సత్తాను ఢిల్లీ వీధుల్లో చాటుతున్నాడు... దటీజ్ జగన్. ప్రత్యేకహోదా పోరాట హీరో ప్రజల దృష్టిలో ముమ్మాటికీ అతనే!

ఢిల్లీలో వైసిపి సత్తా చూపుతున్న

# మరో మొనగాడు



**ఆయన్నొక సాధారణ ఆడిటర్ అనుకున్నారు... ఆయనకు లెక్కలు తప్ప రాజకీయాల్లో ఎక్కాలు తెలియవనుకున్నారు. ఆయనను రాజ్యసభకు పంపుతుంటే... ఈ ఆడిటర్ పార్లమెంటుకు వెళ్ళి ఏం చేస్తాడన్నారు. వై.యస్.కుటుంబం పట్ల విశ్వాసం చూపినందుకే రాజ్యసభకు పంపించారన్నారు.**

నిజమే... వై.యస్. కుటుంబం పట్ల ఆయన చూపిస్తున్నది విశ్వాసం కాదు, అంతకుమించిన ప్రేమ, అభిమానం. అంతటి అభిమానం ఉండబట్టే జగన్‌తో పాటే కేసుల్లో ఇరుక్కున్నాడు. జగన్‌తో పాటే జైలులో గడిపాడు. ఈరోజు జగన్ కోసమే ఢిల్లీ రాజకీయాల్లో చక్రం తిప్పుతూ ప్రత్యర్థులను షేక్ చేస్తున్నాడు.

ఈరోజు వరకు కూడా రాజ్యసభలో వైయస్సార్ కాంగ్రెస్‌కు వున్న ఒకే ఒక సభ్యుడు వి.విజయసాయిరెడ్డి. ఒక్కడైతేనేం వందమందితో సమానం. సభలోని 250 మందికి లెక్కలు చెప్పగల నైజం ఆయనది. పార్లమెంటు సమావేశాలలో తనదైన శైలిలో రాణిస్తున్నాడు. రాజకీయంగా అనుభవం లేకపోయినా, ఎంతో పరిణితి ప్రదర్శిస్తున్నాడు. 2014 ఎన్నికల్లో వైసిపి 8 లోక్‌సభ స్థానాలను గెలిచింది. ఎన్డీఏ కూటమిలో తెలుగుదేశం ఉండడం, కాంగ్రెస్ ప్రతిపక్ష హోదా కూడా కోల్పోవడం, బీజేపీ కంటే కాంగ్రెస్సే బద్ధశత్రువు కావడం మూలంగా జాతీయ రాజకీయాల్లో వైసిపి ప్రభావం పెద్దగా లేకుండా పోయింది.

అయితే రాజ్యసభ సభ్యుడిగా విజయసాయిరెడ్డి ఢిల్లీలో ఎప్పుడు అడుగుపెట్టాడో అప్పుడే పొలిటికల్ సీన్ మారిపోయింది. జాతీయ రాజకీయాల్లోనూ, ఢిల్లీలోనూ వైసిపికి ఒక ట్రాక్ ఏర్పడింది. విజయసాయిరెడ్డి పార్లమెంటులో అడుగుపెట్టనంతవరకు జగన్ లక్ష కోట్లు తిన్నాడన్న టీడీపీ నేతల వాయిస్సే అక్కడ వినిపిస్తుండేది. కాని, విజయసాయిరెడ్డి ఢిల్లీలో అడుగుపెట్టాక ఏపి నుండి నిజాలు మాత్రమే వెళ్ళసాగాయి. జగన్‌పై పెట్టిన కేసుల్లో దురుద్దేశ్యాన్ని, అధికారంలోకి వచ్చాక తెలుగుదేశం ప్రభుత్వం చేస్తున్న అవినీతిని కేంద్రం దృష్టికి తీసుకెళ్ళడంలో విజయసాయిరెడ్డి శక్తివంచన లేకుండా కృషి చేశాడు. చంద్రబాబు మితిమీరిన అధికార దుర్వినియోగాన్ని దుబారాను కేంద్రం దృష్టికి తీసుకువెళ్ళడం వల్లే కేంద్రం ఈరోజు ఏపికి ఇస్తున్న నిధులపై గట్టిగా లెక్కలు అడుగుతోంది. ఆ లెక్కలు అడగబట్టే తన బొక్కలు బయటపడతాయని చంద్రబాబు ప్రత్యేకహోదా సొడ్డు పెట్టి ఎన్డీఏ నుండి బయటకొచ్చాడు.

ప్రత్యేకహోదా ఉద్యమం విషయంలోనూ జగన్‌కు విజయసాయిరెడ్డి కొండంత అండగా నిలిచాడు. జగన్ ప్రజాసంకల్ప పాదయాత్ర ద్వారా రాష్ట్ర పరిధిలు దాటకుండా ఇక్కడే ఉద్యమానికి రూపకల్పన చేస్తుంటే, ఉద్యమ సెగలను పార్లమెంటును తాకేలా చేసింది విజయసాయిరెడ్డే! ప్రత్యేకహోదా ఇవ్వనందుకు నిరసనగా కేంద్రంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే అంశంలోను, దానికి అన్ని పక్షాల మద్దతు కూడగట్టడంలోనూ ఆయన చేసిన ప్రయత్నాలు అనిర్వచనీయం. బీజేపీకి అమిత్‌షా, రాంమాధవ్, కాంగ్రెస్‌కు అహ్మద్‌పటేల్, గులాంనబీ ఆజాద్, సమాజ్‌వాదీకి ఒకప్పుడు అమర్‌సింగ్ లాంటి నాయకులు ఎలా ఆయువుపట్టుగా వుండేవాళ్ళో, ఇప్పుడు వైసిపికి విజయసాయిరెడ్డి ఆయువుపట్టయ్యాడు. నాడు వై.యస్. కుటుంబానికి, నేడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి నమ్మినబంటు అయ్యాడు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటున్నాడు. తాను కేవలం లెక్కల మాంత్రికుడినే కాదు, రాజకీయ తాంత్రికుడిని కూడా అని రుజువు చేసుకుంటున్నాడు.

# బాబుకు దడ

(మొదటి పేజీ తరువాయి)

ఒక నాయకుడిని టార్గెట్ చేస్తే ఎంతలా తొక్కుతున్నాడో ఒక లాలూను, ఒక శశికళను చూస్తే అర్ధమవుతుంది. చంద్రబాబు మీద 'ఓటు-నోటు' కేసుతో పాటు పలు కేసులు కోర్టుల్లో పెండింగ్‌లో వున్నాయి. వీటన్నింటి మీద ఆయన 'స్టే'లు తెచ్చుకుని వున్నాడు. ఈ నాలుగేళ్ళలో 24మంది ఎమ్మెల్యేలను, ముగ్గురు ఎంపీలను వైసిపిలో నుండి లాగాడు. కొన్నాడని చెప్పొచ్చు కూడా! నలుగురు వైసిపి ఎమ్మెల్యేలకు మంత్రి పదవులిచ్చి రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కాడు. ఇక పరిపాలనా పరంగా చూస్తే అన్నీ వైఫల్యాలే! అమరావతి రాజధాని అని చెప్పి ఎన్ని దేశాలు తిరిగాడో, ఎన్ని కోట్లు దుబారా చేసాడో లెక్కే లేదు. పోలవరం ప్రాజెక్ట్‌ను నేనే కడతానని చెప్పి 16వేల కోట్ల అంచనా వ్యయాన్ని 56వేల కోట్లకు తీసుకెళ్లాడు. కేంద్రం ఇచ్చిన నిధులను తన ఆర్భాటపు కార్యక్రమాలకు మళ్ళించాడు. కేంద్రం నిధులతో అమలు చేయాల్సిన పథకాలకు తన పేరు పెట్టుకున్నాడు. పుష్కరాలు, తాత్కాలిక ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ల పేరుతో వేలకోట్ల అవినీతి జరిగింది. వీటన్నింటిలో దేని మీద విచారణ చేయించినా చంద్రబాబుకు ఇబ్బంది తప్పదు.

మరి బీజేపీ వూరుకుంటుందా? వారి ఆలోచనలు వారికున్నాయి. రాష్ట్రంలో పవన్‌తో కలిసి ఆ పార్టీ ఎన్నికలకు వెళ్ళే అవకాశముంది. పవన్ ప్రత్యేకహోదా పోరాటాలు చేస్తాడు. కర్నాటకా ఎన్నికల తర్వాత ఏపికి కేంద్రం ప్రత్యేకహోదా ప్రకటించే అవకాశాలున్నాయి. ఎందుకంటే ముందుగా ఏపికి హోదా ఇస్తే కర్నాటకా ఎన్నికల్లో ఆ ప్రభావం బీజేపీపై పడుతుంది. కాబట్టే కర్నాటక ఎన్నికల తర్వాత ఏపి ఎన్నికలకు ముందు హోదా ప్రకటన వుండొచ్చు. జగన్, పవన్ చేసిన పోరాటాల వల్లే ప్రత్యేకహోదా ఇచ్చామనే సంకేతాలు రావచ్చు. బీజేపీ వాళ్ళు జగన్ జోలికైతే పోరు. ఎందుకంటే అతని మాట మీద నిలబడే నైజం వారికి ఇష్టమే. ఒక్క చంద్రబాబు నైజమే వారికి సరిపడడం లేదు. అందుకే చంద్రబాబును టార్గెట్ చేశారు. బీజేపీ వాళ్ళు ఎక్కడ మొదలుపెడతారో, ఎక్కడ నరుకుతారో అర్థం కాక చంద్రబాబుకు దడ పట్టుకుంది.

# ఏపిలో కాంగ్రెస్ బ్రతికే వుంది...

## తెలుగుదేశం రూపంలో...



- టీడీపీకి ప్రాణప్రతిష్ట చేసింది కాంగ్రెస్సే
- సోనియాగాంధీ తన బిడ్డలను చంపుకుని తెదేపాను బ్రతికించింది
- భవిష్యత్‌లో బాబు కాంగ్రెస్‌తో కలిసే అవకాశం?

***విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ చచ్చిపోయింది. తన గోతి తానే తవ్వుకుంది. తన నెత్తిన తానే మట్టి పోసుకుంది. ఇదీ చాలామంది అభిప్రాయం. కాని, లోతుగా పరిశీలిస్తే ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ చచ్చిపోలేదు... తెలుగుదేశం రూపంలో బ్రతికొచ్చింది.***

'యముడికి మొగుడు' సినిమాలో ఇక చనిపోతాడనుకున్న 'చిరంజీవి' పాత్రధారి శరీరంలోకి యమలోకంలో వున్న మరో చిరంజీవి ఆత్మను ప్రవేశపెడతారు. 2014 ఎన్నికల సమయంలోనూ రాష్ట్రంలో ఇదే జరిగింది. అప్పటికే ఈ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ చిక్కి శల్యమైపోయింది. అంతకుముందు ఐదేళ్లలో వై.యస్. ప్రజాపాలన దెబ్బకు శిథిలమైపోయింది. చాలా చోట్ల అభ్యర్థులు కూడా దొరకని పరిస్థితి. అటువంటి వాతావరణంలో తెలుగుదేశం పార్టీ పాలిట సోనియాగాంధీ ఇటలీ దేవత అయ్యింది. ఆంధ్రుల పాలిట దెయ్యమైంది. రాష్ట్రాన్ని విభజించి తెలుగుదేశంకు ప్రాణ ప్రతిష్ట చేసింది. ఇక రాజకీయ భవిష్యత్తు లేదు, రాజకీయాలలో మనుగడ లేదు అనుకున్న చంద్రబాబుకు రాజకీయ పునర్జన్మనిచ్చింది. ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బ్రెయిన్‌డెడ్‌కు గురై, కోమాలో వున్న తెలుగుదేశంకు తన గుండె, కిడ్నీలు, కాలేయం, కళ్ళు దానం చేసింది. దాంతో కాంగ్రెస్ ఆత్మ, అవయవాలు అన్నీ కూడా తెలుగుదేశంలో అంతర్భాగమై, ఆ పార్టీ కోమా నుండి కోలుకుంది. ఒకరకంగా చెప్పాలంటే సోనియాగాంధీ తన బిడ్డలైన కాంగ్రెస్‌వాళ్ళను చంపుకుని, పరాయి బిడ్డలైన చంద్రబాబు, కేసీఆర్‌లను ముఖ్యమంత్రులను చేసిందనే చెప్పవచ్చు. ఇందులో ఆమెకు ప్రత్యక్ష పాత్ర లేకపోయినా, రాష్ట్ర విభజన ద్వారా ఆమె తీసుకున్న నియంతృత్వపు విధానాలే దీనికి కారణమయ్యాయి.

రాష్ట్రంలో ఇప్పుడున్నది ఎన్టీఆర్ ఆశయాలకనుగుణంగా తెలుగు వారి ఆత్మగౌరవానికి ప్రతీక లాంటి పార్టీ కాదు. తెలుగుకాంగ్రెస్ పార్టీ... కాంగ్రెస్ ఆత్మతో, కాంగ్రెస్ అవయవాలతో మనుగడ సాగిస్తున్న పార్టీ. 2014 ఎన్నికల్లో ఆ పార్టీకి కాంగ్రెస్ నాయకులే దిక్కయ్యారు. ఆ పార్టీ గెలుపుకు దోహదం చేసింది కాంగ్రెస్ నాయకులే! చంద్రబాబు ప్రభుత్వంలో మంత్రివర్గంలోను, నామినేటెడ్ పదవుల్లోనూ వారిదే హవా! సోనియాగాంధీకి రెండుసార్లు కేంద్రంలో తమను గద్దెనెక్కించడానికి ఏపి నుండి మెజార్టీ లోక్‌సభ సీట్లు అందించిన వై.యస్. కుటుంబం కంటే కూడా చంద్రబాబే ఎక్కువయ్యాడు. చంద్రబాబుతో కలిసే జగన్‌ను కేసుల్లో ఇరికించి ఇబ్బందులపాల్జేసారు.

ఎన్టీఆర్ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగానే తెలుగుదేశం పార్టీని స్థాపించాడు. చంద్రబాబు మాత్రం అవసరమైతే అధికారం కోసం కాంగ్రెస్‌తో కూడా పొత్తుపెట్టుకునేటట్లున్నాడు. ఎందుకంటే ఆయన బ్లడ్‌లో కాంగ్రెస్ వుంది. ఎన్టీఆర్ రాజకీయ జీవితం స్వచ్ఛమైన తెలుగుదేశం నేతగా మొదలైంది. చంద్రబాబు రాజకీయ జీవితం కాంగ్రెస్‌లోనే మొదలైంది. కాబట్టి ఆ లక్షణాలు ఎక్కడికీ పోవు. ఎన్టీఆర్ ఫీల్డ్‌లో వున్నంతవరకు, వెన్నుపోటుకు గురికానంతవరకు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగానే జాతీయ స్థాయిలో అన్ని పార్టీలను ఏకతాటి పైకి తెచ్చాడు. కాని, చంద్రబాబు చేతిలోకి రాగానే 1996లో ఆయన చేసిన మొదటి పని కాంగ్రెస్ మద్దతు తీసుకుని కేంద్రంలో యునైటెడ్ ఫ్రంట్‌ను ఏర్పాటు చేయడం. 2009 ఎన్నికల దాకా రాష్ట్రంలో కాంగ్రెస్సే ప్రధానపార్టీ కాబట్టి ఆయన ఆ పార్టీతో ఫైట్ చేస్తూ వచ్చాడు. 2014 ఎన్నికల నుండి సీన్ మారింది. రాష్ట్రంలో వైసిపి ప్రధాన ప్రత్యర్థి అయ్యింది. ఇప్పుడాయన కాంగ్రెస్‌తో స్నేహం చేసినా ఇబ్బంది లేదు. తెలంగాణలో ఆ దిశగానే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలుస్తోంది. ఇప్పటికే ఎన్డీఏతో డైవోర్స్ అయ్యింది. ఇక కలవకపోవచ్చు. 2019 ఎన్నికల్లో ఎన్డీఏ తిరిగి అధికారంలోకి వస్తుందన్న నమ్మకం లేదు. ఒకవేళ వచ్చినా వాళ్ళు చంద్రబాబు మీద పగబట్టి వున్నారు కాబట్టి వాళ్ళు చేసేది చేయకమానరు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే, ఇంకో 5ఏళ్ళు కేసుల భయం లేకుండా గడపొచ్చు. ఆ దిశగానే చంద్రబాబు స్నేహగీతం మారుస్తున్నట్లుగా సమాచారం.

## అలసి సొలసిన కోటంరెడ్డి



నిద్ర లేచింది మొదలు నిద్రపోయే వరకు ప్రజల సమస్యలు వింటూ వారి సమస్యల కోసం పోరాడుతూ వారిమధ్యే గడిపే నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆ ప్రజల పనుల్లో వున్నప్పుడే అలసి సొలసి అస్వస్థతకు గురయ్యారు.

ఈ నెల 18వ తేదీన ఉగాది సందర్భంగా రూరల్ నియోజకవర్గంలో జరిగిన పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ఆయన ఎడతెరిపి లేకుండా పాల్గొన్నారు. రాత్రి ఇంటికి వెళ్ళాక అస్వస్థతకు గురయ్యారు. కుటుంబసభ్యులు వెనువెంటనే ఆయనను దగ్గరలోని సింహపురి ఆసుపత్రికి తీసుకెళ్ళగా, ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్ ఉన్నట్లు హైటైఫాయిడ్ జ్వరంతో బాధపడుతున్నట్లు గుర్తించారు. కోటంరెడ్డికి బాగాలేదని తెలియగానే 19వ తేదీ ఆయన అభిమానులు, వైకాపా కార్యకర్తలు పెద్దఎత్తున సింహపురి ఆసుపత్రికి చేరుకున్నారు. కాగా, మెరుగైన వైద్యం, కొంత కాలం విశ్రాంతి కోసం ఆయనను బెంగుళూరుకు తీసుకెళ్ళారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం బాగానే ఉంది.






Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Executive Editor-G.SREENIVASULU REDDY. e-mail: roopagroup@yahoo.com